RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక


మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 2 VOLUME : 2 | సంచిక : 319 ISSUE NO : 319 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం, జూన్, 7, 2025 Saturday, June,7,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-




## మతిలేని వాడితో మాటలా?

- ట్రంప్, ఎలాన్ మస్క్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం
- సోషల్ మీడియాలో పరస్పర దూషణలతో రచ్చ
- మస్క్‌తో ఫోన్ కాల్‌ను తిరస్కరించిన ట్రంప్
- టెస్లాకు 150 బిలియన్ డాలర్ల నష్టం
- 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' తో చెడిన స్నేహం
- గత ఎన్నికల్లో ట్రంప్‌కు మస్క్ భారీ మద్దతు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌ల మధ్య స్నేహబంధం పూర్తిగా బెడిసికొట్టింది. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదాలు, సోషల్ మీడియాలో పరస్పర దూషణలతో వారి మైత్రికి దాదాపు తెరపడింది. ఈ పరిణామాల నేపథ్యంలో, మస్క్‌తో ఏర్పాటు చేసిన ఫోన్ కాల్‌ను ట్రంప్ తిరస్కరిం చడమే కాకుండా, "మతిస్థిమితం లేని వ్యక్తితో ఏం మాట్లాడతాను?" అంటూ ఆయనపై ఘాటు వ్యాఖ్యలు చేయడం సంచలనం రేపింది. ఈ వివాదం టెస్లా సంస్థకు పెను నష్టం చేకూర్చింది.



## భారత్‌కు నాలుగు లేఖలు రాసిన పాకిస్తాన్

న్యూఢిల్లీ : పెహల్గాం దాడి తర్వాత సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత ప్రధాని మోడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందాన్ని నిలిపివేయడం వల్ల పాకిస్తాన్ నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అందుకే ఇరుదేశాల మధ్య ఉన్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పాకిస్తాన్ భారత్‌కు నాలుగు లేఖలు రాసింది. పాకిస్తాన్ జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తాజా.. భారత జలశక్తి మంత్రిత్వశాఖకు పంపారు. ఆ తర్వాత ఆ లేఖలను విదేశాంగ మంత్రిత్వశాఖకు పంపినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ ఒప్పందంపై భారత్ చాలా స్పష్టమైన వైఖరితో వ్యవహరిస్తోంది. ఉగ్రవాదం, వ్యాపారం కలిసి సాగలేవని, అలాగే రక్తం.. నీరు కూడా కలిసి ప్రవహించలేవని భారత్ స్పష్టం చేసింది. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నమ్మకంతో, స్నేహభావంతో రూపొందించి నప్పటికీ పాకిస్తాన్ మాత్రం ఆ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతోందని.. అందుకే తాము ఈ వైఖరి తీసుకున్నట్లు భారత్ తెలియజేసిందని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదానికి తన మద్దతును నిలిపివేసే వరకూ.. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించడం సాధ్యపడదని భారత్ స్పష్టం చేసింది. పెహల్గామ్ దాడి తర్వాత భారత భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఎస్) ఈ నిర్ణయం తీసుకుంది.

## రాష్ట్ర మహిళలను అవమానిస్తారా

### ఇంత దిగజారుడు రాతలతో పైశాచికానందమా: లోకేశ్



అమరావతి,జూన్7: అమరావతి దేవతల రాజధాని కాదు అది వేశ్యల రాజధాని అంటూ సాక్షి టీవీ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలను మంత్రి నారా లోకేష్ తీవ్రంగా తప్పుబట్టారు. అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి మీడియాలో వచ్చిన వార్తలపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ తీవ్రంగా స్పందించారు. రాజధాని మహిళలను అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమంటూ హెచ్చరించారు.
మహిళలను ఇంత ఘోరంగా అవమానిస్తారా అంటూ విరుచుకుపడ్డారు. మహిళలను ఇంత ఘోరంగా మీడియా సాక్షిలో అవమానిస్తారా జగన్ అంటూ ప్రశ్నించారు.రాష్ట్ర మహిళలను అవమానపరుస్తూ క్షమించరాని నేరానికి పాల్పడిన జగన్ రెడ్డి బేషరతుగా మహిళా లోకానికి క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.



## నేడు తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ

- కొత్తగా ముగ్గురు లేదా నలుగురికి చోటు
- రేవంత్ సీనియర్లతో మంతనాలు
- నిన్న మీనాక్షి నటరాజన్ తో రెండు గంటల పాటు చర్చలు
- హస్తిన పెద్దల సూచనలతో మంత్రి వర్గ విస్తరణకు అడుగులు
- రెడ్డి, బిసి, ఎస్సీ, మైనార్టీ లకు కొత్త మంత్రి వర్గంలో అవకాశం
- నేడు గవర్నర్ అందుబాటులో ఉండాల్సిందిగా కోరిన ప్రభుత్వం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**
ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం .. దీంతో రేపే కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేతలు అంటున్నారు.. ఇప్పటికే గవర్నర్ రేపు అందుబాటులో ఉండాల్సిందిగా ప్రభుత్వం గవర్నర్ కార్యదర్శికి సమాచారం ఇచ్చింది. ఇక హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కొత్త మంత్రుల ఎంపిక కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీనియర్ మంత్రులతో, టిపిసిసి అధ్యక్షుడితో మంతనాలు జరుపుతున్నారు.. ఇదే విషయంపై శుక్రవారం నాడు రేవంత్ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జీ మీనాక్షి నటరాజన్ తో రెండు గంటల పాటు చర్చలు జరిపారు.. హైకమాండ్ మంత్రి వర్గ విస్తరణపై తెలిపిన అభిప్రాయాలను రేవంత్ తో మీనాక్షి పంచుకున్నారు.. ఇక రేవంత్ మంత్రి వర్గంలో ఆరుగురికి చోటు ఉండగా ప్రస్తుత విస్తరణలో ముగ్గురికి లేదా నలుగురికి అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం .. కొత్త మంత్రి వర్గంలో రెడ్డి, ఎస్సీ, బిసి, మైనార్టీలకు చోటు దక్కవచ్చని అంటున్నారు.. దీనిపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది.



## రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

### - నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి: కేటీఆర్


**హైదరాబాద్ జూన్ 7,తెలంగాణ దిశ:.**
గోదావరి,కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన అని విమర్శించారు. నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాళ్లు అంటే.. దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..'తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాలు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసింది. నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతినీటిబొట్టును ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా,పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90 శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కారం నిరంతరం పనిచేసింది. కానీ నేడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే శీర్షిక ఎక్కడో పోయింది. నిస్సిగ్గుగా రాష్ట్ర ముఖ్యమం త్రి గానీ, బీజేపీ నీళ్ల విషయంలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి హరీశ్‌రావు వివరంగా సమాచారం అందిస్తారు.గుజరాత్‌లో మార్బీ అనే ప్రాంతంలోఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మందిచనిపోయినా ఏ ఎన్‌డీఎస్‌ఏ పోదు, గోదావరి జలాల విషయంలో ఏపీ అనుమతుల్లేకుండా కడుతున్న ప్రాజెక్టు మీద ముఖ్యమంత్రి మాట్లాడడు, బీజేపీ కేంద్ర మంత్రులు మాట్లాడరు, కాంగ్రెస్ బీజేపీ వాళ్లు నోరు తెరవరు. అందుకే గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఏనాటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష.' అని కేటీఆర్ అన్నారు.




## నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్‌పై అభాండాలు

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

**హైదరాబాద్ జూన్ 7,తెలంగాణ దిశ:.**
రాజకీయ లబ్ధి కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వర ప్రాజెక్టు కూలినట్లు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లిచ్చి కన్నీళు తుడిచిన కేసీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ గొంతు పిసికే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. కాళేశ్వరంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని, తాము చెప్పే విషయాలు నూటికి నూరుపాళ్లు నిజమన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు-వాస్తవాలు' అనే పేరుతో తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కి.మీ సొరంగాలు, 1,531 కి.మీ గ్రావిటీ కాలువలు, 98 కి.మీ ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోతలు. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోసేలా మొదట రూపకల్పన చేశారు. తమ్మిడిహట్టి వద్ద నీళ్లు తక్కువ ఉంటాయని ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాం. మేడిగడ్డ బ్యారేజీని 7 బ్లాకులుగా 85పియర్లుగా నిర్మించారు. కాళేశ్వరం లేకుండా పంటలు పండాయని కాంగ్రెస్ చెబుతోంది.



## వచ్చే ఐదురోజులు వానలేవానలు

### వాతావరణ శాఖ చల్లటి కబురు

**హైదరాబాద్ జూన్ 7,తెలంగాణ దిశ:.**
రాష్ట్ర ప్రజల కు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో వర్షాలు కురిశాయి. ప్రస్తుతం వర్షాలు ముఖం చాటేయడంతో.. మళ్లీ ఎండలు దంచికొడు తున్నాయి. భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రాగ ల ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొం ది. ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ మధ్య మహా రాష్ట్ర నుంచిఉత్తరఇంటీ-రియర్ కర్నా టక, తెలంగాణ మీదుగా కోస్తా ఆం ధ్ర వరకు సగటు- సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్లఎత్తులోఉన్నఉపరితల ద్రోణి బలపడిందని పేర్కొంది.

# రాజీవ్ స్వగృహ - హౌసింగ్ బోర్డు ఫ్లాట్లు, స్థలాలు విక్రయం

## - వివాదాలు లేని ఆస్తుల కొనుగోలుకు చక్కటి అవకాశం
## - హౌసింగ్ బోర్డు కమిషనర్ విపి. గౌతమ్

**హైదరాబాద్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ఫ్లాట్లను బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ విపి. గౌతమ్ లు సిద్ధం చేసిన ప్రతిపాదనలకు వనరుల సమీకరణలపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘం ఆమోదం తెలిపింది. ఈ నెల 20 వ నాటికి ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ను విడుదల చేయాలని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాలలోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తైన, పాక్షికంగా పూర్తైన అపార్ట్ మెంట్లు-ఫ్లాట్ తో పాటు, ఓపెన్ ప్లాట్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఎటువంటి వివాదాలు లేని భూములు, అందుబాటులో ఉండే ధరలతో నిర్మించిన అపార్ట్ మెంట్లు - ఫ్లాట్లను కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ కమిషనర్ గౌతమ్ విజ్ఞప్తి చేశారు. ఈ విక్రయాలతో వచ్చిన ఆదాయంతో, ఒఆర్ఆర్ పరిసరాల్లోనూ, ఇతర జిల్లాల్లోనూ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా హౌసింగ్ పథకాలను చేపట్టాలని భావిస్తున్నారు. వీటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహకు సంబంధించినంత వరకు గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో (ఒక్కో దానిలో సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉన్న టవర్ ను యూనిట్ గా)ఏక మొత్తంగా విక్రయించనున్నారు. బిల్డర్లు, ఒక గ్రూప్ గా ఏర్పడి కొనుగోలు చేయాలనుకున్న వారితో పాటు, హౌసింగ్ కార్యక్రమాలు నిర్వహించేసంస్థలు, బహుళ అంతస్తుల భవనాల అవసరం ఉన్న సంస్థల, వంటి వారు తీసుకునేందుకు వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. వేలం వేయనున్న వాటి వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ స్వగృహకు చెందినరంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కుర్మల్ గూడలో 20, చందానగర్ లోని 3 ఓపెన్ ఫ్లాట్లు, బండ్లగూడలో 159 పూర్తైన ఫ్లాట్లు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలోని 5 టవర్లలోని పూర్తి కాని కట్టడాలు, పోచారంలోని పూర్తైన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధ రకాల ఫ్లాట్లు, బహదూర్ పల్లిలోని 69 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111, అమిస్తపూర్ లోని 45 ఓపెన్ ప్లాట్లను విక్రయించడానికి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతో పాటు, 3.38 ఎకరాల ఖాళీ స్థలాన్ని కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. హౌసింగ్ బోర్డు స్థలాలు కూకట్



పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ (కెపిహెచ్ బి)- 4 వ ఫేజ్ లో ఖాళీగా ఉన్న 7 ఎకరాల 33 గుంటల విస్తీర్ణంలో ఖాళీ భూములను, అదే కాలనీలో ఉన్న రెండు ఓపెన్ ప్లాట్లును(4598 చదరపు గజాల విస్తీర్ణం, 2420 చదరపు గజాల విస్తీర్ణం) ఈ-ఆక్షన్ ద్వారా విక్రయించనున్నారు. అలాగే నాంపల్లి లోని 1148 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఖాళీ స్థలాన్ని, సంజీవరెడ్డి నగర్ లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్ కు చెందిన 2605 చదరపు గజాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంజీవరెడ్డి నగర్ లోని కమ్యూనిటీహాల్ (సెల్లార్, స్టిల్ట్, జి+1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణంలో 37,070 చదరపు అడుగుల పార్కింగ్ స్థలంతో పూర్తి అయ్యే స్థితిలో ఉన్నది. ఈ భూములను ఫంక్షన్ హాల్ నిర్వహణ కోసమే వేలం వేయనున్నారు.

# బిజెపి బాచుపల్లి కార్యవర్గం నియామకం

**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :బిజెపి బాచుపల్లి కార్యవర్గాన్ని శనివారం బాచుపల్లి శాఖ అధ్యక్షులు ప్రసాద్ రాజు ప్రకటించారు. కమిటీ ప్రధాన కార్యదర్శులుగా గజ్జల సంతోష్ కుమార్, నారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా గోపతి సురేష్, శివ గణేష్, ఉదయ్ కిరణ్, విజయ్ కుమార్, కార్యదర్శులుగా సునీల్ రెడ్డి, హరిత, విజ్ఞాన్ రెడ్డి, అమర్నాథ్, కోశాధికారిగా ప్రహ్లాద్ లను నియమించారు. అదే విధంగా డివిజన్ ఇంచార్జీలుగా ఒకటవ డివిజన్ భార్గవిరెడ్డి,15 డివిజన్ సాయి కృష్ణారెడ్డి ,16వ డివిజన్ రేపన్ కాసి, 17వ డివిజన్ శివప్రసాద్, 18వ డివిజన్ కృష్ణారెడ్డి, 19 డివిజన్ కాసాని సంతోష్, 27 డివిజన్ అశోక్ నాయక్, 21 డివిజన్ పావనిరెడ్డి లను ప్రకటించారు. ప్రజల మధ్య ఉంటూ ప్రణాళిక బద్దంగా. పారదర్శకతతో పనిచేసే వారిని కార్యవర్గంలోకి తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారి యొక్క నిబద్ధత, పార్టీ పట్ల శ్రద్ధ, పార్టీకి కేటాయించే సమయం, క్రమశిక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని క్రియాశీలకంగా పనిచేసే వారిని కమిటీలోకి తీసుకున్నామని తెలిపారు.

# అభివృద్ధి చేయడం చేతకాక..., కేసీఆర్ పై విమర్శలా.. చింతల వెంకటేశ్వర్ రెడ్డి

**భువనగిరి, జూన్ 07, (తెలంగాణ దిశ)** :అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తవుతున్న ఒక్క ప్రాజెక్టు చేపట్టని కాంగ్రెస్ నేతలు అభివృద్ధి ప్రదాత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను విమర్శించడం సిగ్గుచేటని బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. శనివారం రాయగిరి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం అహర్నిశలు పోరాటాలు చేసి సాధించడమే కాకుండా తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన కేసీఆర్ ను విమర్శించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేని వారు ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. ఎలాగో 18 నెలలు గడిచిపోయింది మరో మూడు సంవత్సరాలు అధికారంలో ఉంటారు ఇప్పటికైనా అభివృద్ధి పనులు చేపట్టాలి అని ఆయన సూచించారు. ఇప్పటికీ ఒక్క ప్రాజెక్టు ను చేపట్టింది లేదని ఎద్దేవా చేశారు. సుదీర్ఘంగా రాజకీయాలలో ఉన్న కేసీఆర్ ను స్థాయికి మించి విమర్శించడం తగదన్నారు. అభివృద్ధి పనులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం కాదు నిధులు కేటాయించాలని ఆయన నిలదీశారు. టిఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అదేవిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల వందనాలు పొందాలని సూచించారు. అంతేకానీ చౌకబారు మాటలు ప్రజలు హర్షించారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గోరంగా మారబోతుందన్నారు. దేశంలోనే ఇంత తొందరగా ప్రజల విశ్వాసం కోయిల పోయిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అవుతుందన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్న పూర్తి మంత్రి వర్గాన్ని విస్తరించలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో ఎవరికి వారే యమునా తీరేగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు ఎవరు పనిచేయడం లేదన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిందన్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అన్ని రకాలుగా కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటుంది ఎవరని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి హుందాగా మాట్లాడాలని సూచించారు. చౌకబారు విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో భువనగిరి సింగిల్ విండో చైర్మన్ నోముల పరమేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు కుతాడి సురేష్, దండబోయిన బాలరాజు, దోసపాటి హరీష్, పల్లపాటి రవికుమార్, గాజుల నవీన్, మోతే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# మిథిలానగర్ లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

## - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజుల రామారం పరిధిలోని మిథిలా నగర్ లో రూ. 13 లక్షల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. కాలనీలో రోడ్ల సమస్య ఉందని కాలనీవాసులు గత నెల రోజుల క్రితం కోలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి కాలనీలో పలు అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఎండి లాయక్, ఆలేటి శ్రీనివాస్ రావు,



సేవాదళ్ కుత్బుల్లాపూర్ ఎ -వింగ్ అధ్యక్షులు పి. విజయ్ రెడ్డి, మిథిలా నగర్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు సురేష్ కుమార్, ధనుంజయ్ రెడ్డి, యజ్ఞేశ్వరరావు, శివాజీ, జనార్దన్ రెడ్డి, బిఎస్ఎన్ కిరణ్ చక్రవర్తి, జె. ప్రవీణ్ కుమార్, పి. విజయ్ రెడ్డి, డాక్టర్ గంగాధర్ చారి, కె. భీమేశ్వరరావు, ఆర్ శ్రీధర్, విజయ్ వర్మ, సిహెచ్. లక్ష్మణ్, టి. సంపత్ రావు, ఎం రవి, మురళీధర్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ మనుగడ శ్రామిక లోకంతో ముడిపడి ఉంది

## - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద ఫ్లెమింగ్ ల్యాబోరేటరీ కార్మికులు మర్యాద పూర్వకంగా కలిసి కార్మిక ఒప్పంద అగ్రిమెంట్ కు కృషిచేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను



సన్మానించారు. అనంతరం కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కూన శ్రీశైలం గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు, కార్మిక, కర్షకులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమాజ మనుగడ శ్రామిక లోకంతో ముడిపడి ఉందన్నారు. రాజ నీతిజ్ఞుడిగా ప్రజలకు సేవ చేస్తూ, కార్మిక నాయకుడిగా కార్మికుల సమస్యలపై పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు మల్లేశం, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ హరిహర అభయాంజనేయ స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు





**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వర నగర్ లోని శ్రీ హరి హర అభయాంజనేయ స్వామి ఆలయం దశమ వార్షిక బ్రహ్మోత్సవాలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, డివిజన్ కార్పొరేటర్ కెఎం.గౌరీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. అంతకు ముందు నూతనంగా నిర్మించతలపెట్టిన దేవాలయ కమాన్ పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కాలనీ వాసులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మధుకర్ రెడ్డి, కోశాధికారి జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి మనోహర్, సభ్యులు మహేష్ కుమార్, కృష్ణా రెడ్డి, సురేందర్ రెడ్డి, బాలకృష్ణ, శ్రీధర్ రెడ్డి, నాగదీప్ గౌడ్, బజార్ రెడ్డి, వార్త శ్రీను, మూర్తి, నరసింహ, నర్సింగరావు, రాంబాబు, జగదీశ్వర్, పుండరీకం, మధు, త్రిమూర్తులు, వి. శ్రీనివాస్, భగవాన్ రెడ్డి, గిరి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ నిజాంపేట్ కార్యవర్గం నియామకం


**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ నిజాంపేట్ శాఖ కార్యవర్గాన్ని అధ్యక్షుడిగా రెండవసారి బాధితులు స్వీకరించిన అధ్యక్షులు బిక్షపతి యాదవ్ శనివారం ప్రకటించారు. బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఇంచార్జీ అధ్యక్షులు డాక్టర్ మల్లారెడ్డి సూచనల మేరకు కార్యవర్గాన్ని ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులుగా దేవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సచిన్, పోలిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శులుగా సురేష్, కౌశిక్ నాయుడు, సతీష్ కృష్ణ, కోశాధికారిగా కొట్టు త్రినాథ్, కార్యవర్గ సభ్యులుగా గాజుల సుజాత, నరసింహారెడ్డి ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా పొట్లకాయ వెంకటేష్, ట్రేడ్ సెల్ అధ్యక్షులుగా నరేష్ గుప్తా, మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా జోసెఫ్ ఇంటలెక్చువల్ సెల్ అధ్యక్షులుగా అప్పారావు స్పోక్స్ పర్సన్ గా సంతోష్ సోషల్ మీడియా కన్వీనర్ గా కూన ప్రసాద్ లను నియమించారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ నిజాంపేట్ లో పార్టీని మరింత ప్రతిష్ట చేయాలని సూచించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి నిజాంపేట్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# రాజు యాదవ్ తల్లి శంకరమ్మ పార్థివ దేహానికి నివాళులు

## - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హనుమంత్ రెడ్డి వ్యక్తి గత సహాయకుడు (పిఏ) నార్లకంటి రాజు యాదవ్ తల్లి శంకరమ్మ పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి నివాళులు అర్పించారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి క్యాన్సర్ తో ఆమె ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే 131





డివిజన్ ద్వారక నగర్ కుత్బుల్లాపూర్ లో నివాసం ఉంటున్న (పిఏ) రాజు యాదవ్ ఇంటికి హన్మంత్ రెడ్డి వెళ్లి నార్లకంటి శంకరమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మ శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. కుటుంబ సభ్యులుగా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ఆ కుటుంబానికి మనోధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

# షార్ట్ సర్క్యూట్ తో మంటలు యువకుడు సజీవ దహనం

**కుత్బుల్లాపూర్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి మాట్లాడుతుండగా విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి యువకుడు సజీవ దహనం అయ్యాడు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం... జగద్గిరిగుట్ట రింగుబస్తీలో నివసించే సాయి (27) తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు గుడికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి రూమ్ అంతా పొగలతో నిండిపోయి ఉంది. వారి కుమారుడు సాయి శరీరం పూర్తిగా కాలిపోయి చనిపోయి ఉన్నాడు. ముఖంపై తీవ్ర గాయాలతో గుర్తుపట్ట లేనంతగా గాయాల పాలయ్యాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు అంటుకొని సాయి అక్కడికక్కడే చనిపోయి ఉన్నాడు. ఇరుగు పొరుగుని కేకలు వేసి సాయి తల్లిదండ్రులు పిలవడంతో వారు వచ్చి చూడగా అప్పటికే సాయి చనిపోయి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి రూము అంతా కలియ తిరిగి సాయి మృతదేహాన్ని



పరిశీలించారు. సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడుతున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మొబైల్ ఫోన్ పేలిఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని జగద్గిరిగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సంపాదకీయం

## పశ్చిమాసియాను నిప్పుల కొలిమిగా మార్చిన ఇజ్రాయిల్

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధానికి అక్టోబరు 7వ తేదీతో ఏడాది పూర్తవుతుంది. హమాస్ దాడిని ఒక సాకుగా చూపించి ఇజ్రాయిల్ గాజాపై మానవ మారణహోమం ప్రారంభించింది. హమాస్‌ను నిర్మూలించేందుకే తాను గాజాపై దాడి చేస్తున్నానని చెప్పింది. ఆ లక్ష్యం సాధించడం అటుంచి ఇజ్రాయిల్ ఈ రోజుకు వచ్చేసరికి మొత్తం పశ్చిమాసియాను నిప్పుల కొలిమిగా మార్చింది. లెబనాన్, ఇరాన్, సిరియా, ఎమెన్, ఇరాక్‌లపై దాడికి ఒడిగడుతున్నది. ఇజ్రాయిల్ దురాక్రమణలో భాగంగా వేసే ప్రతి అడుగునూ బలపరుస్తూ అమెరికా గట్టిగా వత్తాసుదారుగా నిలిచింది. గత పక్షం రోజులలో లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న సైనిక దాడులు యుద్ధం స్వభావాన్నే మార్చేశాయి. ఒక పథకం ప్రకారం మొదలుపెట్టిన దాడిలో అది దక్షిణ లెబనాన్‌పై ముమ్మర వైమానిక దాడులకు దిగింది. పేజర్లు ఇతర సమాచార సాధనాలను ఉపయోగించి హిజ్బుల్లా నాయకుల హత్యలకు పాల్పడింది. సంస్థ కేంద్రంలో వున్న హిజ్బుల్లా ప్రధాన కార్యదర్శి హసన్ నస్రుల్లాను ఒక బంకర్ విధ్వంసక బాంబర్‌తో హత్య చేయడంతో యుద్ధం మరింత తీవ్రమైంది. దక్షిణ లెబనాన్‌పై ఒక పరిమిత స్థానిక లక్ష్య నిర్దేశిత భూతల యుద్ధం ప్రారంభిస్తున్నట్టు ఇజ్రాయిల్ అక్టోబర్ ఒకటిన ప్రకటించింది. అయితే వాస్తవంలో అది పూర్తి స్థాయి భూతల యుద్ధం కోసం లెబనాన్ సరిహద్దులలో భారీ సంఖ్యలో బలగాలను మొహరించింది. ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో ఒక దుష్ట రాజ్యం. అన్ని అంతర్జాతీయ చట్టాలనూ, ఒప్పందాలనూ ఉల్లంఘించి అది దేశ దేశాలలో పథకం ప్రకారం హత్యలు, దాడులు సాగిస్తున్నది. గత ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ ఇరానియన్ భూభాగంపై వైమానిక దాడులకు పాల్పడ్డం ద్వారా హమాస్ ప్రధాన ప్రతినిధి ఇస్మాయిల్ హనియే ప్రాణాలు తీసింది. నూతనంగా ఎన్నికైన ఇరాన్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు వెళ్లిన హనియేను బలిగొన్న తర్వాత అది బీరుట్‌ను లక్ష్యంగా చేసుకుని నస్రుల్లాను హతమార్చింది. నస్రుల్లా హత్య తర్వాత హిజ్బుల్లా దాదాపు తుడిచి పెట్టుకు పోయినట్టేనని ఇజ్రాయిల్ ప్రకటించింది. అలాంటి దారుణమైన హూంకరింపులు వాస్తవానికి చాలా దూరంగా వుంటాయి. 1992లో ఇజ్రాయిల్ హిజ్బుల్లా సహ వ్యవస్థాపకుడు, రెండవ కార్యదర్శి అబ్బాస్ అల్ ముసావీని హత్య చేసినట్టు ప్రకటించింది. ఆ స్థానంలో నస్రుల్లా వచ్చాడు. తను రెండు సార్లు ఇజ్రాయిల్ సైన్యం దురాక్రమణను ప్రతిఘటించాడు. హిజ్బుల్లా చేతుల్లో రెండుసార్లు పరాజయం పాలైన తర్వాత 2006లో ఇజ్రాయిల్ తను అనుకున్న లక్ష్యం సాధించలేక పోయినట్టు అంగీకరించాల్సి వచ్చింది. ఇదివరకటి తన దుస్సాహసాలకు ఏ గతి పట్టిందో ఇజ్రాయిల్ మరచి పోయినట్టు కనిపిస్తుంది. పశ్చిమాసియాలో అమెరికాకు బలమైన స్థావరంగా వున్న ఇజ్రాయిల్ అమెరికా భాషనే మాట్లాడుతున్నది. 'ఉధృతం నుంచి ఉపశమనం' అంటూ అది తన సైనిక వ్యూహాన్ని ప్రకటించింది. ఇదో లోపభూయిష్టమైన అవగాహన, విఫల వ్యూహం. ఉధృత సైనిక దాడితో శత్రువు లొంగిపోవలసి వస్తుందనేది ఈ వ్యూహంలో వుండే ఆలోచన. అయితే ఈ వ్యూహం ప్రకారమే విజయాలు దక్కుతాయనే గ్యారంటీ ఏమీ లేదని చెప్పడానికి చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా లిబియాలలో అమెరికా దారుణంగా ఓడిపోవడం చూశాం, ఇప్పుడూ ఇజ్రాయిల్‌కు అదే గతి పట్టబోతున్నది. హిజ్బుల్లా దళాలు తమ దాడులతో నిస్సహాయ స్థితిలో పడిపోయాయనీ, కనుక ఇరాన్ కూడా ఆ ప్రభావానికి గురై బలహీనంగా మారిందని యుద్ధోన్మాద ఇజ్రాయిల్ నాయకులు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌పై సైనిక దాడులు జరగాలని, ఆ దేశ అణు కేంద్రాలనూ లక్ష్యంగా చేసుకోవాలనీ చెబుతున్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావడం గురంచీ, పశ్చిమాసియా రాజకీయ ముఖచిత్రం మార్పు గురించీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాట్లాడుతున్నారు. ఈ విశృంఖల భావాలతో రెచ్చిపోయిన ఇజ్రాయిల్ పశ్చిమాసియాలో తన ఆధిపత్యం నెలకొల్పుకోవాలని నిర్యక్ష్యపూరితంగా ప్రయత్నిస్తోంది. అది అమెరికా ప్రయోజనాలకూ ఉపయోగకరమవుతుంది. ఇజ్రాయిల్‌ను నిలవరించడానికి తన ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఇరాన్ ఇప్పుడు ఆ దేశంపై 180కి పైగా మిసైళ్లను ప్రయోగించింది. తమ గగనతలంపై ఇజ్రాయిల్ దాడి చేశాక ఇరాన్ ప్రతీకార దాడి చేయడం ఇది రెండోసారి. అమెరికా నుంచి, దాని మిత్ర దేశమైన బ్రిటన్ వంటి దేశాల నుంచి తిరుగులేని మద్దతు వల్లనే ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ధైర్యం వస్తున్నది. ఈ సంఘర్షణ ప్రతి దశలోనూ అమెరికా నుంచి ఇజ్రాయిల్‌కు మద్దతు లభిస్తూనే వుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మరే దేశానికీ ఇవ్వనంతగా 12,400 కోట్ల డాలర్ల సహాయం అందించింది. 2016 నుంచి చూస్తే దశాబ్ది సహాయం పథకంలో భాగంగా ఇజ్రాయిల్ ఏటా మొత్తం 3800 కోట్ల డాలర్ల సహాయం అందుకున్నది. గాజాపై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిన రోజున అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరింత సైనిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. పేలుడు పదార్థాలు, విధ్వంసక పరికరాలు అందించి ఇజ్రాయిల్ ఉక్కు చట్రాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇజ్రాయిల్ రక్షణ బలగాలు మానవ హక్కుల హననానికి పాల్పడుతున్నారని వస్తున్న నివేదికలను బొత్తిగా పెడచెవిన పెట్టి అమెరికా ఆగష్టులో ఇజ్రాయిల్‌కు తమ దేశ సైనిక పరిరకాలను, ఆయుధాలను కొనుగోలు చేయడం కోసం 3500 కోట్ల డాలర్ల అదనపు సహాయం పంపించింది. గత ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ ఆయుధ పాటవం పెంపు కోసం 1400 కోట్ల డాలర్ల సాయం లభించింది. వీటన్నిటినీ మించి అమెరికా ఇజ్రాయిల్‌కు మద్దతుగా యుద్ధ విమానాలు, క్షిపణి విధ్వంసక ఆయుధాలు తరలించింది. ఇరాన్ మిసైళ్లను తిప్పికొట్టడంలో తమ సైన్యం కీలకమైన వ్యూహాత్మక పాత్ర పోషించిందని అమెరికా ప్రకటించింది. బ్రిటన్ కూడా అలాంటి ప్రకటనే చేసింది. ఇజ్రాయిల్‌కు అమెరికా ఇన్ని విధాల ఆర్థిక, ఆయుధ సహాయం అందిస్తుంటే కాల్పుల విరమణకూ యుద్ధ ప్రజ్వలన చల్లార్చడానికి ప్రయత్నిస్తున్నాని మాట్లాడటం కేవలం కంటి తుడుపు, పసలేని పల్లవి మాత్రమే. పాలస్తీనాతో సంఘీభావం అనే విధానం నుంచి వైదొలగిన భారత ప్రభుత్వం అమెరికాకు, ఇజ్రాయిల్‌కు కూడా వ్యూహాత్మక భాగస్వామిగా వుంది. 12 నెలల్లోగా అన్ని ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలగాలని ఇజ్రాయిల్‌ను ఆదేశిస్తూ ఐక్యరాజ్యసమితి ముందుకొచ్చిన తీర్మానంపై ఓటింగులో పాల్గొనకుండా వుండిపోయింది.

# రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలేవీ..?




పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రూపాయికే కిలోబియ్యం పథకం పందికొక్కుల పాలవుతోంది. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. బియ్యం మొత్తం విదేశాలకు తరలుతున్నాయి. కొందరు అధికారులు, రాజకీయ నేతలు కలసి దీనిని బడా వ్యాపారంగా మార్చేశారు. రూపాయికే కిలో బియ్యం పథకంలో లోపాలు కళ్లకు కనిపిస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కావాలనే అచేతనంగా ఉండిపోయాయి. పథకం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోవడం లేదు. 42 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయలుగా ఉన్న బియ్యాన్ని తలకుమాసిన నేతలు అధికారంలోకి వచ్చి..కిలో రూపాయి చేశారు. ఇప్పటికే జనాభాలో 80శాతం మందికి ఈ బియ్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంకా కొత్తగా రేషన్ కార్డుల డిమాండ్ పుట్టుకొస్తోంది. పాతవాటిలో అక్రమాలను అరికట్టి, బియ్యం ధరలు పెంచి పక్కాగా పథకాన్ని అమలు చేయాల్సిన ఇరు రాష్ట్రాల సిఎంలు ఇంకా ప్రజలను మభ్య పెడుతున్నారు. వేలకోట్లు దుర్వినియోగం అవుతున్న ప్రజాధనానికి ఎవరు బాధ్యులు అన్నది చెప్పడం లేదు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నుల డబ్బులను ఇష్టారీతిన వృధా చేయడమేనా పాలకుల పని అని ప్రజలు నిలదీయాల్సి ఉంది. ఇకపోతే ఎపిలో పేదల బియ్యం పూర్తిగా పక్కదారి పట్టాయి. రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలించిన తీరు బయటపడ్డా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తూ వచ్చారు. అసలు దోషులు బయట పడకుండా పేదల బియ్యాన్ని పెద్దలు గద్దల్లా ఎగరేసుకు పోయారు. తెలంగాణలో సైతం ఇలాంటి దోపిడీ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఓట్లమీద ఉన్న శ్రద్ధ అక్రమాలను అరికట్టడంలో కనిపించడం లేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం అసలు పేదలకు అందడం లేదన్నది అక్షర సత్యం. ఈ బియ్యం ఆటో, లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని రుజువయ్యింది. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రానిదని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఎందుకు దీనిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి సమీక్షించాలి. నిజమైన పేదలను గుర్తించాలి. దుబారా పథకాలకు కాలం చెల్లిందన్న విధంగా కళ్లెం వేయాలి. నగదు బదిలీ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఓట్లు ముడిపడి వున్నందున దీనిని సమీక్షించడం సాధ్యం కావడంలేదు. పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారన్న చర్చ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో కనీసం 40లుగా ఉన్న బియ్యం ఇప్పుడు రూపాయికే దక్కితే అవి పెద్ద వ్యాపార వస్తువుగా మారింది. ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలగడం ఇందుకు నిదర్శనం. ఎపిలో గత ఐదేళ్లలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లరు శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు. ఇక తెలంగాణలో ఎంత దోచకున్నారో కిక్కురుమనడం లేదు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందే. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో ఎక్కువ మంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ఇలా అక్రమాలను పక్కన పెట్టి సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత...బియ్యాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ.43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నారన్నది కూడా ప్రశ్నే. ధాన్యం సేకరణ నుండే పాలకులు,ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి నాయకులు అప్పనంగా సంపాదించుకుంటున్నారు. గ్రామాల వారీగా కార్డులు ఉన్నవారి వివరాలు సేకరించి, అందులో పేదలు ఎంతమందన్నది గుర్తించాలి. నిజమైన పేదలకే బియ్యం అందాలి. అప్పుడే ఈ పథకంలో అక్రమాలను నిరోధించగలం.ప్రజా పంపిణీలో అక్రమాలను అరికట్టాలి. దోషులు ఎంతటి వారైనాసరే కఠినంగా శిక్షించాలి.

## బిజెపి ప్రగతి నగర్ కార్యవర్గం నియామకం

**కుత్బుల్లాపూర్,జూన్ 07,(తెలంగాణ దిశ)** :బిజెపి ప్రగతినగర్ కార్యవర్గాన్ని నియమించినట్లు ప్రగతి నగర్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి తెలిపారు.ప్రధాన కార్యదర్శులుగా మదన్మోహన్ గౌడ్,సాయికిషోర్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, మైలవరం అశోక్, శివకుమార్ గుప్తా, నల్లమోతు నరేష్ కార్యదర్శులుగా నాగార్జున (అర్జున్), విత్తనాల సతీష్, వింజం రామకృష్ణ, లక్ష్మి, కోశాధికారిగా రవితో కూడిన 11 మందితో కార్యవర్గం ప్రకటించారు. ఈ సందర్భంగా నరేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రగతి నగర్ లో పార్టీని మరింత ప్రతిష్ట పరిచేందుకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ ప్రణాళిక బద్దంగా. పారదర్శకతతో పనిచేసే వారిని కార్యవర్గంలోకి తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారి యొక్క నిబద్ధత, పార్టీ పట్ల శ్రద్ధ, పార్టీకి కేటాయించే సమయం, క్రమశిక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని క్రియాశీలకంగా పనిచేసే వారిని కమిటీలోకి తీసుకున్నామని తెలిపారు.

## మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**ఉప్పల్, జూన్ 07, (తెలంగాణ దిశ)** :అనారోగ్యంతో మరణించిన ఉప్పల్ డివిజన్ వినాయక నగర్ కి చెందిన వడ్డేపల్లి కృష్ణ కుమారుడు వడ్డేపల్లి అఖిల్ కుటుంబానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు పిల్లి నాగరాజు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన అఖిల్ మరణించడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుగురి శ్రీకాంత్, లింగంపల్లి ప్రభాకర్, కుందనపల్లి రాజు, పెద్దుల కృష్ణ, మామిండ్ల రాజు, హరి, సుధాకర్, వడ్డేపల్లి నర్సింహా, గణేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# చిక్కడు...దొరకడు...

## పార్టీలో హాట్ హాట్ గా ఎంవీపీ వ్యవహారం

విశాఖపట్టణం: పవర్ ఈజ్ ఆల్ వేస్ పవర్ ఫుల్. అందుకే అధికార పార్టీలో ఉండేందుకు..ఆ పార్టీ కండువా కప్పుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తుంటారు నేతలు. ఒకసారి పార్టీ అధికారం కోల్పోయిందంటే చాలు..లీడర్లు సైలెంట్ అయిపోతుంటారు.అలాంటి నేతల్లో విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఒకరు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆయనకంటూ అంతో ఇంతో పేరుంది. పాలిటిక్స్‌కు వచ్చేసరికి ఓ సారి ఎంపీ అయ్యారే తప్ప..ఎంవీవీ అంటే ఎవరూ ఠక్కున చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ఆయన విశాఖ ఎంపీగా పనిచేసిన కాలంలో కూడా పెద్దగా ప్రజల్లో తిరిగింది లేదు. జగన్ వస్తే వేదిక మీదకు మొక్కుబడిగా వచ్చి వెళ్లడం తప్పితే ఎంపీగా ఆయన పాత్ర చాలా పరిమితం. ఇందుకు బలమైన కారణమే ఉంది. రాజకీయాల్లో ఉంటూ వ్యాపారాలు చక్కబెట్టుకోవాలనుకున్నారు తప్పితే..రాజకీయం కోసం ఆయన ఏనాడూ వ్యాపారం చేయలేదని వైసీపీ నేతలే చెబుతుంటారు.అతి పెద్ద నగరంగా ఉన్న విశాఖ వంటి సిటీకి ఎంపీ అంటే రాష్ట్ర రాజకీయాలకు చాలా కీలకం. విశాఖలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల కార్యకలాపాల అంశంలోనూ, విభజన హామీలతో పాటుగా అనేక విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పలు సంప్రదింపులు, కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. కానీ ఎంవీవీ స్టైలే వేరు. ఆయన ఇలాంటి అంశాలపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.ఏపీలో వైసీపీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీ నేతలంతా డీలా పడిపోయారు. అక్కడో ఇక్కడో ఒకరిద్దరు నేతలు కాస్త మీడియా ముందు కనిపిస్తున్నారే తప్ప..దాదాపుగా అందరు నేతలూ సైలెంట్‌గా ఉన్నారు. అవంతి శ్రీనివాస్, ఆడారి ఆనంద్‌తో పాటుగా పలువురు నేతలు పార్టీకి గుడ్ బై చెప్పి వెళ్లిపోయారు. మరి కొంతమంది నేతలు కాస్తో, కూస్తో యాక్టీవ్‌గా ఉన్నారు. కానీ విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఆయన పార్టీలో యాక్టీవ్‌గా లేరు. పోనీ అలాగని అవంతి శ్రీనివాస్, ఆడారి ఆనంద్‌లా బయటకు వెళ్లిపోయారా అంటే అదీ లేదు. దీంతో అసలు ఎంవీవీ పార్టీలో ఉన్నారా..లేరా.. అనే కన్ఫ్యూజన్ క్యాడర్, లీడర్లలో కొనసాగుతోంది. పార్టీ ఓటమి తర్వాత ఎక్కడా కనిపించడమే లేదు. విశాఖ జిల్లా పార్టీ పరిస్థితులపై అధినేత జగన్ నిర్వహించిన సమీక్ష సమావేశాలకు కూడా ఎంవీవీ వెళ్లలేదు. అలాగే ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి నియమితులైన తర్వాత పార్టీ కార్యాలయంలో విశాఖ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆ మీటింగ్‌కు కూడా ఎంవీవీ ఎగనామం పెట్టేశారు. అంతేకాదు రైతు సమస్యలపై అన్నదాతకు అండగా వైసీపీ, విద్యుత్ ఛార్జీలపైనా ఇటీవల వైసీపీ నిరసనలు చేపట్టింది. పార్టీ నేతలంతా పాల్గొనాలని హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. కానీ ఎంవీవీ సత్యనారాయణ ఎక్కడా పత్తా లేరు. దీంతో ఈ మాజీ ఎంపీ వ్యవహారంపై వైసీపీలో అందరికీ క్లారిటీ వచ్చేసింది. పార్టీకి దూరంగా ఉంటున్నాడంటే.. ఆయన కండువా మార్చేందుకు రెడీ అయ్యారన్న భావనకు వచ్చేశారట.ఎంవీవీ సత్యనారాయణ వైసీపీ కార్యకలాపాల్లో అస్సలు పాల్గొనడం లేదు. పార్టీని విడిచి పెట్టరు..అలాగని పార్టీ కోసం పనిచేయరు. పోనీ రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించారా అంటే అదీ లేదు. దీంతో వైసీపీ పెద్దలకు, క్యాడర్‌కు ఆయన వ్యవహారం ఏ మాత్రం అర్థం కావడం లేదట. 2019 ఎన్నికలకు ముందు పార్టీలో చేరి అనూహ్యంగా ఎంపీ అయిన ఎంవీవీని పార్టీ కూడా పట్టించుకోవడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, ఓడిపోగానే మొహం చాటేస్తున్న నేత ఉంటే ఏంటీ, లేకపోతే ఏంటీ అన్న రీతిలో పెద్దలు ఉన్నారట. ఆయనంతట ఆయనే రాజీనామా చేసి వెళ్లిపోతాడోమో అని ఎదురు చూస్తున్నారట.కానీ ఎంవీవీ మాత్రం ఆ పార్టీని వీడటం లేదు. ఏదో పార్టీలోకి దారి దొరికితే వైసీపీకి గుడ్‌బై చెబుదామని ఎదురు చూస్తున్నారట. కూటమి పార్టీల నుంచి లైన్ క్లియర్ కాకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారట ఎంవీవీ సత్యనారాయణ. సైలెంట్‌గా వైసీపీలో ఉన్నంత కాలం ఉండటం, రూట్ క్లియర్ కాగానే జంప్ కొట్టాలనే ప్లాన్‌లో ఎంవీవీ ఉన్నారని విశాఖ వైసీపీ వర్గాల టాక్. ఓవరాల్ ఎపిసోడ్‌ను చూసిన వారంతా ఈ పొలిటికల్ బిజినెస్‌మెన్ రాజకీయాలను బాగా ఒంట పట్టించుకున్నారని చర్చించుకుంటున్నారట. ఎంవీవీ ఫ్యాన్ కిందే ఉంటారా లేక కూటమి గొడుకు కిందకు వెళ్తారా అన్నది వేచి చూడాలి మరి.


# కలవర పెడుతున్న కల్తీ ఆహారం..!

భోజన ప్రియులు పెరిగారు. ఇంటివంటకన్నా బయట బిర్యానీలు, కరీలకు ప్రాముఖ్యం పెరిగింది. అలాగే కరీపాయింట్స్ పెరిగాయి. రుచికరమైన హోటళ్లు..అమ్మచేతి వంట అంటూ ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ఇలాంటి అనేక హోటళ్లలో పరిశుభ్రత డొల్ల అని ఇటీవల అధికారుల వరుస దాడలతో బట్టబయలు అయ్యింది. పరిశుభ్రత, నాణ్యత అన్నవి పక్కకు పోయాయి. ప్రపంచవ్యాప్తంగా మాంసాహార ప్రియులే ఎక్కువగా ఉంటారు. శాఖాహారం కన్నా మాంసాహారాన్నే చాలా మంది ఇష్టంగా ఆరగిస్తుంటారు.ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ లేదా మటన్ తెచ్చుకోవాల్సిందే. అమ్మ లేదా భార్యతో రుచికరంగా వండించుకుని తినాల్సిందే. ఇటీవల కాలంలో హోటళ్లు విపరీతంగా పెరిగిపోయాయి. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఎ÷-లాట్ ఫామ్స్ వచ్చిన తర్వాత ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఒక్క క్లిక్‌తో బిర్యానీ ఇంటి ముందుకే రావడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆర్డర్ పెట్టుకుని తినేస్తున్నారు. అయినా ఆదివారం రోజును అంతా ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. ఆ రోజు ఇంట్లో కచ్చితంగా నాన్ వెజ్ ఉడకాల్సిందే. లేదంటే ఏదో వెలితిగా అనిపిస్తుంటుంది. రోజు కచ్చితంగా నాన్ వెజ్ తినాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారయ్యింది. ఇదే అదనుగా అనేకులు హోల్ బిజినెస్ రంగంలోకి దిగారు. రుచికరమైన, శుచికరమైన వంట అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ బొద్దింకలు, వెంట్రుకుల, మేకులు, జెర్రీలు ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు , ప్రాణులు బిర్యానీల్లో దర్శనమిస్తున్నాయి. మాంసాహార ప్రియులకు ఆదివారం ప్రత్యేకమైన రోజు. చాలా దేశాల ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు స్థానిక చట్టాల ప్రకారం తమ ఉద్యోగులకు వారానికి ఓ రోజు ఇవ్వాల్సిన సెలవు దినాన్ని ఆదివారంగా ఎంచుకున్నారు. వారం మొత్తం కష్టపడి పని చేసిన ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి, శరీర అలసటతో ఉంటారు. ఆ ఒక్కరోజు మాత్రం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే మానవజాతి ఆవిర్భావం నుంచి నాన్ వెజ్ తినడానికే మనిషి ఎక్కువగా ఇష్టపడుతుంటాడు.

అయితే ఆదివారం రోజున తమ కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిసే సమయంలో మాంసాహారం ఉంటే ఇంక ఆ మజానే వేరుగా ఉంటుంది. అందుకే ఆదివారం రోజున చికెన్, మటన్, చేప వంటి మాంసాహారాలు తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే పిల్లలు కూడా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ వారం మొత్తం బిజీబిజీగా ఉంటారు. ఆ ఒక్కరోజే ఇంటి వద్ద ఉంటారు. అందుకే ఈ రోజున నాన్ వెజ్ తినేందుకు ఎక్కువగా మంది మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారాలు హోటళ్లకు గిరాకీ పెరుగుతోంది. సంప్రదాయమే కాలక్రమేనా సంస్కృతిగా మారి పోయింది. ఆదివారం మాంసాహారం తినని కుటుంబం అంటూ ఉండదు. దాదాపు ప్రతిఒక్కరూ ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు ఆదివారాన్ని ప్రత్యేకంగా చూస్తారు. ఆ రోజు నాన్ వెజ్ తీసుకురాకపోతే పిల్లలు పెద్ద యుద్ధమే చేస్తుంటారు. దీంతో ఆదివారం నాన్ వెజ్ తినడం తప్పని సరిగా మారిపోయింది. అందుకే ఆదివారం నాడు చికెన్, మటన్ షాపుల ముందు ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతుంటారు. అదేరీతిలో హోటళ్లు కూడా కిక్కిరిసి పోతున్నాయి. ముందే ఆర్డర్ ఇవ్వడం, రిజర్వ్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది. అయితే ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న హోటళ్లు కూడా శుచి, శుభ్రత, నాణ్యత విషయంలో డొల్ల అని తేలింది. వారి కిచెన్‌లను పరిశీలించినప్పుడు పాచిపోయిన, కాలం చెల్లిన పదార్థాలు దర్శనం ఇస్తున్నాయి. హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై నోరూరించే, ఘుమ ఘుమలాడే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉంటున్నాయి.

కనీస ప్రమాణాలు పాటించకుండా మాంసాహారాన్ని నిల్వ ఉంచుతున్నారు. పలు చోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం నూనెలు, అనుమతి లేని రంగులను మితిమీరి వాడుతున్నారు. కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరి స్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.

# సాంకేతికతకు అగ్రస్థానం.. ఐఐటీ బాంబే



అదవిదేవులపల్లి,తెలంగాణ దిశ:ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బాంబే భారతదేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఒకటి. దీనిని 1958లో ముం బయిలోని పొవాయిలో 545 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించారు. 100 మంది విద్యార్థులతో మొదలైన విద్యాలయం ఇప్పుడు 10 వేల మందికి చేరుకుంది. ఇక్కడ 15 కోర్సుల్లో 1,204 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. 2023లో అత్యధిక వార్షిక వేతనం రూ.3.67 కోట్లు అందుకున్న వారు ఈ క్యాంపస్ నుంచే ఉన్నారు. గతేడాది 50 జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్లలో 46 మంది దీన్నే ఎంచుకున్నారు. విశాలమైన క్యాంపస్, ప్రైమ్ లొకేషన్, గొప్ప ప్లేస్‌మెంట్స్, ప్రీమియర్ రీసెర్చ్ సదుపాయాలు, ప్రపంచస్థాయి సిబ్బంది కలిగి టాపర్లను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ బాంబేలో ఎంటెక్ చేస్తున్న మిర్యాలగూడకు చెందిన వడత్య వేద శ్రీలు విషయాలు పంచుకున్నారిలా.. ' నాన్న వెంకట్రాం నాయక్ పెద్దవూర మండలం పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, అమ్మ లావూరి పద్మ మిర్యాలగూడ మండలం జాలుబాయితండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. 2019లో బాంబే ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో చేరి.. 2023లో ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని 2023 ఆగస్టు నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో 'ఎలక్ట్రానిక్ పవర్ సిస్టమ్'పై పీజీ(ఎంటెక్) చేస్తున్నా. విద్యార్థుల్లో ఆలోచన, ఆత్మస్థైర్యం పెంచేలా బోధన సాగుతోంది. పుస్తకాల్లో లేని ప్రశ్నలు పరీక్షల్లో వస్తుండడంతో తాము నిరంతరం గ్రంథాలయాల్లో పుస్తకాలు, ఆన్‌లైన్‌లో సమాచారం సేకరించి నోట్స్‌ని ఏర్పాటు చేసుకుంటాం. పలు అంశాలపై చేసిన పరిశోధన పత్రాలను పరిశీలనకు పంపించినప్పుడు, ప్రొఫెసర్లు పరిశీలించి, ఉత్తమమైనవాటిని ఇతరుల కోసం ఆన్‌లైన్‌లో పెడతారు. హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం ఉంటుంది. నెలవారీగా సమావేశాలు నిర్వహించి ప్రొఫెసర్ల పనితీరు, విద్యార్థుల సమస్యలపై చర్చిస్తారు.కళాశాల చుట్టూ చెట్లు, సరస్సు,కొండలు ఉండడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఆంధ్ర–తెలంగాణలో నిర్వహించే వినాయక చవితి, దసరా, శ్రీరామనవమితో పాటు ఉత్తరాదిన నిర్వహించే దుర్గామాత ఉత్సవాలను క్యాంపస్‌లో ఘనంగా నిర్వహిస్తారు. సాంకేతికతతో పాటు, సాంస్కృతిక కళావారధిగా నిలుస్తుం దడంతో ఇది అగ్రస్థానంలో కొనసాగుతోందని' చెప్పుకొచ్చింది. ఐఐటీ బాంబే అనేక సంఘాలను కలిగి ఉంది. సొసైటీలు, క్లబ్‌లు, ఇన్‌సింక్–డ్యాన్స్‌క్లబ్, ఫైన్‌ఆర్ట్స్ క్లబ్, ఫోర్‌వాల్ క్లబ్, లైఫ్‌స్టైల్ క్లబ్, మూడ్ ఇండిగో సాంస్కృతిక ఉత్సవాలు ప్రధా నమైనవి. నాటకాలు, సాహిత్యం, కళలు, లలితకళలు, సంగీతం, పండగల నిర్వహణ వంటి పలు అంశాలు ఐఐటీ బాంబేని అగ్రస్థానంలో నిలిపాయి.

# పంటరుణమాఫీ నిధులందేనా!

జగిత్యాల,తెలంగాణ దిశ:జిల్లాలోని రెండు కెనరాబ్యాంకు బ్రాంచిల్లో 1,570 మంది రైతులు రూ.23 కోట్లవరకు పంటరుణం తీసుకోగా తొలిమూడు విడతల్లో వీరికి మాఫీ నిధులు రాలేదు. జిల్లాలోని 5 ఇండియన్ బ్యాంకు శాఖల్లో 2,592 మంది రైతులు రూ.28 కోట్ల పంటరుణం తీసుకోగా వీరిపేర్లుకూడా మాఫీ జాబితాలో లేవు. ఇదేమని జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులను ఆరాతీస్తే హైదరాబాద్‌లోని సెంట్రల్ సర్వర్‌లో జరిగిన పొరపాటుగా గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పంటరుణమాఫీ ప్రక్రియలోని లోటుపాట్లు వేలాదిమంది రైతులపాలిట శాపంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం 12.12.2018 నుంచి 9.12.2023 వరకు తీసుకున్న నూతన రుణాలు, రెన్యూవల్స్‌ను పరిగణనలోకి తీసుకొని పంటరుణాలను మాఫీ చేసింది. కానీ రెండు బ్యాంకుల పరిధిలో 4,162 మంది రైతులు 12.12.2018 కన్నా ముందుగా రుణం తీసుకొని కటాఫ్ తేదీల్లోనే రెన్యూవల్ చేసినా జాబితాలో చేర్చలేదు. ఈ రైతులకు మాఫీ రావాలంటే రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం మేరకు ప్రిన్సిపల్ కార్యదర్శి సంతకం అవసరమని రాష్ట్ర ఉన్నతాధికారులు పేర్కొనగా వీరిలాగే ఇతరత్రా సమస్యలతో వేలాదిమందికి నిధులు విడుదలయ్యేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే 4 వేల మందికిపైగా తమకు నిధులందలేదని గ్రీవెన్స్‌సెల్ ద్వారా ఫిర్యాదు చేశారు. జిల్లాలో రుణఖాతాలు మూసివేశారని 150 మందికి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో అసలుకన్నా వడ్డీ అధికమైందనే కారణంతో 250 మంది పేర్లను పరిగణనలోకి తీసుకోలేదు. 30కిపైగా కారణాలతో జిల్లాలోని 25 వేలమంది రైతులకు నిధుల విడుదల ఆగింది. దీనిపై డీఏవో వాణి మాట్లాడుతూ కుటుంబ సభ్యుల నిర్ధారణ, ఇతరత్రా సమస్యల పరిష్కారానికిగాను జిల్లాలో క్షేత్రసర్వేను ప్రారంభించి వివరాలను నిత్యం



ప్రత్యేక పోర్టల్‌ద్వారా అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రేషన్‌కార్డు ప్రాతిపదికన మూడుదఫాలుగా రూ.2 లక్షల పంటరుణం కలిగిన జగిత్యాల జిల్లాలోని 67,243 మంది రైతులకు రూ.529.82 కోట్లను విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం రేషన్‌కార్డులు లేనివారి కుటుంబాలను గుర్తించేలా సర్వేచేసి కుటుంబంలో రూ.2 లక్షల వరకు మాఫీ నిధులను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించటం

కార్డుల్లేని రైతులకు న్యాయం చేకూర్చనుంది. ఇదివరకు రేషన్ కార్డులున్నవారు నష్టపోయే పరిస్థితి తలెత్తింది. జిల్లాలో 3 లక్షలకుపైగా రేషన్‌కార్డులుండగా ఇందులో కనీసం 2 లక్షలకుపైగా రైతులు ఉన్నారు. పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులను జారీ చేయలేదు, కుటుంబాల విభజన చేపట్టలేదు. దీంతో ఈ మధ్యకాలంలో పెళ్లిళ్లు చేసుకున్నవారు, భూములు పంచుకుని, కుటుంబాలుగా విడిపోయి వేరువేరుగా ఉంటున్నా ఒకే కుటుంబంగా చూపించటంతో కుటుంబానికి మొత్తం మాఫీ రూ.2 లక్షలకే పరిమితమయ్యింది.

# ప్రజలు అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్



నల్గొండ,తెలంగాణ దిశ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తడిసిన పాత ఇళ్లు, మట్టి మిద్దెలు పడిపోయి ప్రాణహాని జరిగేందుకు అవకాశం ఉందని, అలాంటి ఇళ్ల నుంచి ప్రజలను తక్షణమే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించా రు. భారీ వర్షాలపై ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరె న్స్ నిర్వహించారు. రహదారులపై నీరు ప్రవహిస్తున్న చోట రవాణా పునరుద్ధరణ చేయాలని, విద్యుత్తు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడిన చోట తగు చర్యలు తీసుకోవాలన్నారు.లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుం చి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో, పంచాయతీ కార్యద ర్శులు, పురపాలిక కమిషనర్లు తమ ప్రాంతాల్లో తిరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసు కోవాలన్నారు. రహదారులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ కాజ్‌వేలు, కల్వర్టుల దగ్గర ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సాగర్, మూసీ ప్రాజెక్టు గేట్లు తీసినందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు, పశువులు, దిగవద్దని, మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లకూడదని వివరించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహాయక, పునరావాస చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర పాల్గొన్నారు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు నుంచి రామంజపూరం, శాలి గౌరం వెళ్లే ప్రధాన మార్గం లోలెవల్ కల్వర్ట్ కావడంతో భారీ వర్షాల కారణంగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ మార్గాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. శిథిల నివాసాలు, వర్షాలు, వరద బాధితులకు ప్రభుత్వ భవనాల్లో వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి చెప్పారు. నకిరేకల్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. స్వల్ప మరమ్మతులు అవసరం ఉందని, తాను సోమవారం సమీక్ష నిర్వహించి ఇక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. తమకు సౌకర్యాలు లేవని బాలికల తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ పాఠశాలకు సొంత భవనం మంజూరైందని అన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ చెప్పారు.కూడా భారీ వర్షసూచన ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి నకిరేకల్‌లో తెలిపారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# ఆలయాభివృద్ధికి మోక్షం.. బోర్డు ఏర్పాటు తథ్యం

సిరిసిల్ల,తెలంగాణ దిశ:రాష్ట్రంలో అతి సనాతన, సంప్రదాయ శైవక్షేత్రం.. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. విస్తరణ నమూనాలపై శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీనికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అర్చకులు, ఉన్నతాధికారులతో కలిసి వీటీడీఏ ఛైర్మన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.50 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధిపై ముఖ్యమంత్రికి వివరించారు. దీనికి ముందుగా శృంగేరి పీఠాధిపతి అనుమతి తీసుకోవాల్సి ఉంది. పీఠాధిపతి అనుమతితో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దాని తర్వాత తితిదే తరహా ఆలయ బోర్డును కూడా ఏర్పాటు చేయనున్నారు. రాజన్న ఆలయ ధర్మకర్తల మండలి 2014 వరకు ఉంది. ఆ తరువాతి నుంచి ఉత్సవాల సమయంలో మాత్రం తాత్కాలిక ఆలయ పునరుద్ధరణ కమిటీలు.. ఉత్సవ కమిటీలను నియమిస్తున్నారు. నవంబరు 2022లో దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనికి స్పందించిన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డిసెంబరు 14న ఉత్తర్వులు జారీ చేశారు. ఆసక్తిగల అర్హులైన వారు ట్రస్టు బోర్డు సభ్యులుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికోసం పలువురు ఉత్సాహం చూపించినా ఈ ప్రక్రియ అక్కడితోనే నిలిచిపోయింది. వారం రోజుల్లో శృంగేరి పీఠాధిపతి అనుమతితో ఆలయాభివృద్ధికి బీజం పడనుంది. జిల్లా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంది. గత ప్రభుత్వంలో ఆలయాభివృద్ధి పనుల్లో భాగంగా ఆరోఫాం అర్కిటెక్ సంస్థతో నమూనాలు, ఊహా చిత్రాలు సిద్ధం చేశారు. రెండు అభిషేక మండపాలు, నిత్యనివేదన, నిత్య కల్యాణ మండపాలు ఉంటాయి. తూర్పు, పడమర రాజగోపురాలను తొమ్మిది అంతస్తులు, దక్షణ



గోపురం ఏడంతస్తులు, ఉత్తర గోపురం ఐదంతస్తులకు పెంచుతారు ఆలయ సమీపంలో ఇప్పుడున్న ధర్మగుండంతోపాటు మరో గుండాన్ని నిర్మించనున్నారు. శివ కల్యాణం, సీతారాముల కల్యాణాలకు రెండు వేర్వేరు మండపాలు నిర్మిస్తారు. ఆలయ సమీపంలో సంస్కృత, వేద ఆగమ, సంగీత నాట్య కళాశాలలు నిర్మించనున్నారు. ప్రస్తుతం బద్ది పోచమ్మ ఆలయ ప్రహరీ, శివార్చన వేదిక నిర్మాణం, గుడిచెరువు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.మానేరు జలాశయం.. రాజన్న ఆలయ పట్టణాన్ని కలిపి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా గతంలోనే ప్రణాళికలు చేశారు. వీటీడీఏతోపాటు ప్రత్యేక నదీతీర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలి. ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా రూ.15 కోట్లతో మూలవాగు సమీపంలో కాటేజీలు, రూ.29.50 కోట్లతో నాంపల్లిగుట్టపై రహదారులు, రూప్‌వే, ధ్యాన మందిరం, పార్కులు, కాటేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు కానీ.. అవేవీ కార్యరూపం దాల్చలేదు.

# కలెక్టరేట్ వద్ద రెండు పడక గదుల లబ్ధిదారుల నిరసన..

భువనగిరి,తెలంగాణ దిశ: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌ను రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు ముట్టడించారు. భారాస, భాజపా, సీపీఎం, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు కలెక్టరేట్ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్– హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. రెండు పడక గదిలో మంజూరు చేసిన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసించా రు. గత 8 నెలలుగా రెండు పడక గదుల విషయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే లబ్ధిదారులకు గృహప్రవేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, వరదలు ఉన్నందున బ్రిడ్జిలు, కాజువేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే అధికారులను ఆదేశించారు. బీబీనగర్ మండలం రుద్రవెల్లి బ్రిడ్జిని ఆయన సందర్శించి మూసీ నది ప్రవాహాన్ని పరిశీలించారు. వరదలు ఎక్కువగా ఉన్నందున బ్రిడ్జిపై ఎవరిని అనుమతించవద్దని, చేపల వేటకు మత్స్యకారులను వెళ్లనివ్వవద్దని, బారికేడింగ్ బందోబస్తుతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

వాగులు, వరద నీరు పొంగి పొర్లుతున్నందున వాటి దగ్గరకు వెళ్లవద్దని ఆయన ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ముఖ్యంగా సెల్ఫీలు, ఫోటోగ్రాపులు తీసుకోవద్దని కోరారు.అనంతరం పోచంపల్లి మండలం



రామానందతీర్థ ఇనిస్టిట్యూషన్ సందర్శించి వృతి విద్యా కోర్సులలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కోర్సులకు సంబంధించిన అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. వృతి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకొని నైపుణ్యం సాధించాలని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థుల వసతి గృహాలలో వారికి అందిస్తున్న భోజన వసతి సౌకర్యాలను పరిశీలించారు.వెంట బీబీనగర్ తహశీలుదారు శ్రీధర్, పోచంపల్లి తహశీలుదారు బేగంపేట శ్రీకాంత్ రెడ్డి, ఎం.డి.ఓ. భాస్కరరావు, మండల పంచాయితీ అధికారి, తదితరులు ఉన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత



మంథని,తెలంగాణ దిశ: అయిదేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు భర్తీ కాకపోవడంతో.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. అంతేగాక అదనపు బాధ్యతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా..అవి అమలు కావడంలేదు. మంథని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మంథని మండలాల్లో 196 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 39ఉపాధ్యాయ, 88సహాయకుల పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం 60 ఏళ్లు నిండిన ఉపాధ్యాయురాలు, సహాయకులను తొలగించడంతో.. అధిక సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. మూడేళ్లలోపు చిన్నారులకు బాలమృతం, గుడ్లు, పాలు ఇవ్వడం.. ఆరేళ్లలోపు వారికి పప్పు, ఆకుకూరలతో భోజనం పెట్టడం.. గర్భిణిలకు, బాలింతలకు సంబంధించి ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవడం.. ఆట వస్తువులతో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడంలో ఇబ్బందులు ఎదు రవుతున్నాయి. కేంద్రాల్లో సిబ్బంది కొరత వల్ల సేవలు సరిగా అందడంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు లేని చోట.. అదే గ్రామంలో ఉన్న మరొకరికి ఆదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు కేంద్రాల నిర్వహణతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా విధులు నిర్వహి స్తున్నా.. డబ్బులు చెల్లించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సహా యకులు లేని కేంద్రాల్లో.. ఉపాధ్యాయులే వారి విధులు నిర్వహి స్తున్నారు. తాత్కాలిక సహాయకులుగా పనిచేసిన వారికి డబ్బులు ఇవ్వకపో వడంతో.. ఎవరూ ముందుకు రావడంలేదు.

కొంతమంది సొంతంగా డబ్బులు చెల్లించి పనివారిని పెట్టుకుంటున్నారు. మరికొంతమంది డబ్బులు ఇచ్చే పరిస్థితి లేక వారే ఆయాల విధులు నిర్వహిస్తున్నారు. మంథని ప్రాజెక్టులో ఉపాధ్యాయులు, సహాయకులు పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయులు లేనిచోట పక్క కేంద్రాల వారికి అదనపు బాధ్యతలు అప్పగి స్తున్నాం. సహాయకుల కొరత ఉంటే ఉపాధ్యాయులే బాధ్యతలు తీసుకొని పనిచేస్తున్నారు. తాత్కాలికంగా ఆయాలను నియమించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు.

# నిరుపయోగంగా విక్రయ సముదాయాలు



సిరిసిల్ల,తెలంగాణ దిశ:ఆధునిక హంగులతో రైతుబజారును నిర్మించారు. అన్ని వసతులు కల్పించారు. అనువుగా ఉన్న సముదాయాలను వదిలి రహదారులపై విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా నిత్యం క్రయ, విక్రయదారులతో రద్దీగా ఉండాల్సిన రైతుబజార్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేటట్లు చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో కోట్లాది రూపాయాలతో నిర్మించిన షెడ్లు పాడుబడుతున్నాయి. జిల్లా కేంద్రంలో పాత బస్టాండు సమీపంలోని వైద్యుల కాలనీ, కొత్త బస్టాండు ఎదురుగా, గాంధీచౌక్ సమీపంలో కూరగాయలు, పండ్ల విక్రయాలు సాగుతుంటాయి. సిరిసిల్ల పట్టణంలో సుమారు 300 మంది పైగా ఇదే వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా పాత కూరగాయల మార్కెట్‌లో వినియోగదారుల రద్దీ ఉంటుంది. పాత భవనంలో చోటు లేకపోవడంతో వీధుల్లోని రోడ్లపైనే అమ్మకాలు సాగుతున్నాయి. చేపలను రహదారి పక్కనే విక్రయిస్తున్నారు. అపరిశుభ్రమైన ప్రాంతంలో కడిగి ముక్కలుగా చేస్తున్నారు. దుమ్ముధూళి పడిన మాంసాన్ని తిని వినియోగదారులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు లేకపోలేదు. అలాగే బయట అమ్మకాలు జరిపే విక్రయదారులు ఎండ, వానలతో నానా అవస్థలు పడుతున్నారు. రహదారిపై విక్రయాలు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతుంది. ఆ దారి గుండా వెళ్లే ద్విచక్రవాహన చోదకులు చుక్కలు చూస్తున్నారు. అక్కడికి వచ్చే వారు రహదారి దాటుతుండటం, ఆటోలు నిలపడంతో సిద్దిపేట– సిరిసిల్ల ప్రధాన రహదారిపై కొంత ఇబ్బంది అవుతుంది. సిరిసిల్ల రైతులు, కూరగాయల విక్రేతలకు సౌకర్యాల కల్పన దిశగా గత ప్రభుత్వం రైతు బజార్ నిర్మించింది. రూ. 5.17 కోట్లతో రెండేళ్ల క్రితమే సముదాయాలు రూపుదిద్దుకున్నాయి. ఆధునిక హంగులు, సకల వసతులతో అందుబాటులోకి తెచ్చారు. సుమారు వంద మంది అమ్ముకునే సౌలభ్యం ఉంది. అక్కడికి వచ్చే వినియోగదారులు వాహన పార్కింగ్‌కు సైతం స్థలం అనువుగా ఉంది. అయినప్పటికీ అందులో విక్రయాలు చేసేందుకు రైతులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు. అక్కడ కూరగాయలకు గుత్త వేలాలు మాత్రమే సాగుతున్నాయి.

# అధికారుల నిర్లక్ష్యం.. కార్మికులకు శాపం..?

మంచిర్యాల,తెలంగాణ దిశ: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–7 బొగ్గు గని విషయంలో అధికారుల నిర్లక్ష్యం కార్మికులకు శాపంగా మారింది. గనిలోని పని స్థలాలు అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని దాటి ముందుకు వెళ్లడం, కాలపరిమితి ముగియడంతో తక్షణమే బొగ్గు ఉత్పత్తి నిలిపివేయాలని ఇటీవల అటవీశాఖ నోటీసులు జారీ చేసింది. కాలపరిమితి ముగిసి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా అటవీ అనుమతులు తిరిగి పొందడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. అటవీశాఖ పరిధిలో బొగ్గు తవ్వకాలు జరిపేందుకు ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి అటవీ అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఈ విషయంలో యాజమాన్యం నుంచి సరైన స్పందన లేకపోవడంతో కాలపరిమితి ముగిసి బొగ్గు తవ్వకాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అసలు అటవీ అనుమతులు లేకుండా గనిని ఎలా నడిపిస్తున్నారో సంబంధిత అధికారులకే తెలియాలి. ఆర్కే– 7 గని 1983 నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించింది. బొగ్గు తవ్వకాలకు సంబంధించి అటవీ అనుమతులు నాలుగేళ్ల క్రితమే 31–12–2020తో ముగిశాయి. అంతకు ముందే 2018లో ఏరియా అధికారులు లీజు రెన్యూవల్ కోసం కేంద్ర అటవీశాఖకు దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు అధికారుల నుంచి అనుమతి రాలేదు. ఈ విషయమై కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రమే కొనసాగించగా, సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదనే ప్రచారం కార్మిక వర్గాల్లో జరుగుతోంది. గనిలోని ఒక దిశలో 20 శాతం లీజు, మరో దిశలో 80 శాతం లీజు పరిధిలో ఉన్నాయి. డీ పిల్లరింగ్ విధానంలో రెండు సీమ్‌లు నడుస్తున్నాయి. అను




మతులు లేని కారణంగా ప్రస్తుతం ఒక సీమ్ బంద్ చేయాలనే ఆదేశాలున్నాయి. అటవీశాఖ భూములు ఉన్న ప్రాంతంలోని గనికున్న హద్దులు దాటి లోపల బొగ్గును తవ్వుతున్నందన అటవీశాఖ అభ్యంతరం చెబుతోంది. సింగరేణి కార్పొరేట్ స్థాయిలో అటవీ, ప్లానింగ్, ఎస్టేట్స్ శాఖలు సమన్వయంతో పని చేసి కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. అటవీ అనుమతులు లేని కారణంగా బొగ్గు తవ్వకాలు నిలిపి వేయనుం డటంతో గనిలో పని చేసే కార్మికులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఆర్కే–7 గనిలో 1380 మంది కార్మికులు పనిచేస్తున్నారు. గనిలో ఉత్పత్తి నిలిపివేయాల్సి రావడంతో త్వరలో కార్మికులను యాజమాన్యం బదిలీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

# అంకుర కేంద్రం.. ఆలోచనలకు కార్యరూపం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న.. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు స్వయం ఉపాధి దిశగా బాటలు వేస్తూ.. వారిలోని ప్రతిభను వెలికితీస్తూ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దటానికి శ్రీపద్మావతి మహిళా వర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ) కృషి చేస్తోంది. చదువు పూర్తి చేసినవారే కాదు.. చదువుతున్న వారూ నూతన ఆలోచనలను కేంద్రానికి తెలిపితే.. నైపుణ్యం కలిగిన సిబ్బంది సహకారంతో ప్రజలకు ఉపయోగపడే సరికొత్త ఉత్పత్తులకు కేంద్రం బాటలు వేస్తోంది. నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్ఎస్‌టీ ఈడీబీ) ఆధ్వర్యంలో ఇది పని చేస్తుండగా.. డీఎస్టీ, స్టార్టప్ ఇండియా ఆర్థిక సాయం అందిస్తున్నాయి. ఎన్ఎస్‌టీఈడీబీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 130 అంకుర (ఇంక్యుబేషన్) కేంద్రాలు ఉండగా.. ఇందులో రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో మాత్రమే అంకుర కేంద్రాన్ని నిర్వహిస్తోంది. దేశంలోని అంకుర కేంద్రం కలిగిన ఏకైక మహిళా వర్సిటీగా పద్మావతి మహిళా వర్సిటీ ఖ్యాతి గడించింది. ఇదీ ప్రక్రియ వర్సిటీలో 2017 నవంబరులో అంకుర కేంద్రం ప్రారంభమైంది. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఆసక్తి ఉన్న వారు తమ ఆలోచనలను, ప్రాజెక్టు పూర్తవడానికి కావాల్సిన నగదును వివరిస్తూ తమ ప్రాజెక్టు ప్రపోజల్స్‌ను వర్సిటీ టీబీఐకి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించిన అధికారులు స్క్రీనింగ్ కమిటీ ద్వారా ప్రాజెక్టులను ఎంపిక చేసి ఎంపికైన ఇంకుబేటీలకు అడ్మిషన్ లెటర్ ఇస్తారు. వారి ప్రాజెక్టు పూర్తవడానికి కావాల్సిన నగదును




డీఎస్టీ, డీబీటీ, ఎంఎస్ఎంఈ, స్టార్టప్ ఇండియా, ఫండింగ్ ఏజెన్సీలలో ఏదో ఒక దాని నుంచి నగదును అందచేస్తారు. ఇప్పటి వరకు టీబీఐలో ఆంధ్రప్రదేశ్, బెంగళూరుతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 71 మంది ఇంక్యుబేటీలుగా ఉన్నారు. టీబీఐలో శిక్షణ పొందిన వారిలో 60 మందికి పైగా వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు. ఇక్కడ ఇన్నోవేషన్, సబ్జెక్టు, నెట్‌వర్క్, పేటెంట్ మార్కెటింగ్‌పై నిపుణులతో తర్ఫీదు ఇస్తారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), లైఫ్ సైన్స్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఐవోటీ కింద సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అండ్ కంప్యూటింగ్ డిజిటల్ ఇమేజ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, బిగ్‌డేటా అనలెటిక్స్, హెల్త్‌కేర్ డివైజెస్ అంశాలకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను టీబీఐకి పంపించాలి.

# ఇన్‌ఛార్జుల పాలన.. ఎన్నాళ్లీ వేదన

గాంధీనగర్ : దేశస్థాయిలో తనకంటూ ప్రత్యేకత కలిగిన కాకినాడ జేఎన్‌టీయూకేలో ప్రస్తుతం ఇన్‌ఛార్జిల పాలన కొనసాగుతోంది. దీంతో ప్రగతి పడకేసిందన్నది నిష్ఠురసత్యం. గత ప్రభుత్వ హయాంలో తమకు అనుకూలమైన వారిని డైరెక్టర్లుగా నియమించుకోవడంతో పాటు.. ఇష్టానుసారంగా డైరెక్టరేట్‌లను పుట్టించి మరీ నియామకాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వీసీతో పాటు, రిజిస్ట్రార్ రాజీనామాలు చేశారు. అధికారికంగా వీసీ నియామకం జరిగే వరకూ ఇన్‌ఛార్జి వీసీగా మురళీకృష్ణను నియమించగా.. ఆయన సైతం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌తో పాటు, డైరెక్టర్లను నియమించుకున్నారు. విచిత్రం ఏమిటంటే ఏ యూనివర్సిటీలోనూ లేని విధంగా ఇక్కడ ఇన్‌ఛార్జి డైరెక్టర్ల నియామకం జరగడం విశేషం. ఈ పరిస్థితితో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేక యూనివర్సిటీ అభివృద్ధి, ఇతర పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైకాపా హయాంలో జేఎన్‌టీయూకే ఉపకులపతిగా ప్రసాదరాజును నియమించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకు ఆయన రాజీనామా చేశారు. దీంతో ఇన్‌ఛార్జి వీసీగా గతంలో ఓడిఎల్, ఓల్ ప్రోగ్రాం డైరెక్టర్‌గా పనిచేస్తున్న కెవిఎస్‌జి.మురళీకృష్ణను నియమించారు. అప్పటి రిజిస్ట్రార్‌గా ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి హోదా అంశంలో ఆరోపణ ఎదుర్కోవాల్సి రావడంతో ఎల్.సుమలత తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. ఆమె స్థానంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రవీంద్రనాథ్‌ను ఇన్‌ఛార్జి వీసీ నియమించారు. అలాగే జేఎన్‌టీయూ యూసీఈకే ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్ స్థానంలో



ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఎన్.మోహనరావును, ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపల్ అకడమిక్‌గా గణితశాస్త్ర ప్రొఫెసర్ దీక్షితులును, గతంలో మహిళా సాధికారత డైరెక్టర్‌గా ఉన్న స్వరూపారాణిని వైస్ ప్రిన్సిపల్ అడ్మిన్‌గా నియమించారు. బి.బాలకృష్ణను అకడమిక్ అండ్ ప్లానింగ్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా నియమించగా.. జి.యేసురత్నాన్ని అకడమిక్, ఆడిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా నియమించారు. ఎ.స్వర్ణకుమారిని ఫారిన్ యూనివర్సిటీ రిలేషన్స్ ఇన్‌ఛార్జి డైరక్టర్‌గా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా కె.రామును నియమించారు. ఇలా చెప్పుకొంటూపోతే జాబితా చాంతాడును మించిపోతోంది. ఇన్‌ఛార్జిల విధివిధానాలపై స్పష్టత లేకపోవడం మరో సమస్యగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాల పాలన వివాదాస్పదం కావడంతో కూటమి ప్రభుత్వం తాత్కాలిక వీసీలకు పట్టం కట్టింది.


# రుణాల రీ-షెడ్యూల్ పైనే ఆశలు



జిల్లాలో వరదలు, భారీ వర్షాలకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాల రీ-షెడ్యూలు పైనా ఆశలు పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబు పంట రుణాలు రీ-షెడ్యూల్ చేస్తామని భరోసా ఇచ్చారు. దీనికి అనుగుణంగా కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాన్ని నిర్వహించి, రుణాల రీ-షెడ్యూల్‌పై చర్చించారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతులు, సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులను రీ-షెడ్యూల్ పరిధిలోకి తీసుకురానున్నారు.

జిల్లాలోని కిర్లంపూడి, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, పెదపూడి, కాజులూరు మండలాల్లో ఖరీఫ్ పంట రుణం పొందిన రైతులకు రీ-షెడ్యూల్ వర్తింప చేయాలని నిర్ణయించారు. ఈ మండలాల్లో 36,981 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు ధ్వంసమైనట్లు నిర్ధారించారు. ఇదీ లెక్క: ఈ ఖరీఫ్‌లో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు బ్యాంకులు పంట రుణాలు జారీ చేశాయి. 24,791 మంది రైతులు పంటను నష్టపోగా, వీరికి సుమారు రూ.150కోట్ల మేర రుణాల రీ-షెడ్యూల్ అసవరమని ప్రాథమికంగా గుర్తించారు. బ్యాంకుల బ్రాంచీల వారీగా వివరాలను సేకరిస్తున్నారు. రుణం పొంది, పంట నష్టపోయిన వారి జాబితాను రూపొందించనున్నారు. రైతుకు ఎంతో బాసట..: వ్యవసాయ, ఉద్యాన పంటలకు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించిన మేరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేశారు. వరికి ఎకరానికి రూ.46వేలు, మొక్కజొన్నకు రూ.45వేలు, పత్తికి విత్తనాలతో కలిపి రూ.1.50లక్షల వరకు రుణం ఇస్తారు. ఉద్యాన పంటల్లో అరటి, బొప్పాయికి రూ.లక్ష వరకు రుణం పొందే అవకాశం ఉంది. దీని ప్రకారం రెండు విభాగాలుగా అమలు చేస్తారు. 33 శాతం కన్నా ఎక్కువ, 50 శాతంపైనా నష్టాలకు దీన్ని వేర్వేరుగా వర్తింప చేస్తారు.

# గుంతల మార్గం..తప్పేనా గండం



**కాకినాడ,తెలంగాణ దిశ:** గత అయిదేళ్ల వైకాపా పాలనలో రహదారుల కనీస మరమ్మతులు చేపట్టలేదు. గుంతలు పూడ్చేందుకు పైసా ఇవ్వలేదు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబరు వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలకు పరిస్థితి చెప్పనవసరంలేదు. రోడ్లను బాగుచేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆర్‌అండ్‌బీ కాకినాడ సర్కిల్ కార్యాలయం ప్రతిపాదనలు పంపగా రూ.33.87 కోట్లను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ(ఎస్‌డీఆర్ఎఫ్) నుంచి విడుదల చేశారు. 522.160 కి.మీ జిల్లా ప్రధాన రహదారులు(ఎండీఆర్), 180 కి.మీ మేర రాష్ట్ర హైవేల మరమ్మతులు చేపడతారు. జులైలో అధికారులు ప్రతిపాదనలు పంపడం.. ఆ తర్వాత భారీ వర్షాలు, వర దలు రావడంతో రహదారులు మరింత దెబ్బతిన్నాయి. అప్పట్లో ఇచ్చిన అంచనాల కంటే ప్రస్తుతం మూడు, నాలుగు రెట్లు పెరిగాయి. సుమారు రూ.100కోట్ల నిధులిస్తేనే పూర్తిస్థాయిలో బాగుచేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం విడుదలైన నిధులతో గుంతలు పూడ్చి, మరమ్మతులు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మూడు జిల్లాల పరిధిలో రహదారుల మరమ్మతులకు త్వరలో టెండర్లు పిలుస్తాం. డివిజన్ల వారీ దస్త్రాలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం వచ్చిన నిధులతో పనులు చేపడతాం. తొలుత బాగా పాడైన రహదారులకు ప్రాధాన్య మిస్తాం. త్వరలో మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది.

# డిజిటలైజేషన్ మరింత ఆలస్యం


దస్తావేజుల డిజిటలైజేషన్ ప్రక్రియ తిరుపతి, చిత్తూరు జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల్లో రెండేళ్లుగా సాగుతోంది. వాస్తవానికి ఏడాదిలోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. కొన్ని కార్యాలయాల్లో ఉమ్మడి మద్రాసు నాటి రికార్డులు సైతం ఉన్నాయి. దీంతో ఆలస్యం అవుతు న్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పాత దస్తావేజుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయితే క్షణాల్లో వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇకపై పాత దస్తావేజుల నకళ్లు సైతం క్షణాల్లో చేతికి వచ్చే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో 8 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, తిరుపతి జిల్లాలో 17 కార్యాలయాలున్నాయి. పుత్తూరు, రేణిగుంట, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పలమనేరు, చిత్తూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, నగరి, నాయుడుపేట, గూడూరు తదితర కార్యాలయాల్లో డిజిటలీకరణ పనులు సాగుతూనే ఉన్నాయి. గతంలో పాత దస్తావేజులు కావాలని దరఖాస్తు చేసుకుంటే సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన మాన్యువల్ రికార్డులు పరిశీలించి అందించేవారు. వాటిని స్కాన్ చేసి నకళ్లు ఇచ్చేవారు. చెదలు పట్టడం, పేజీలు చినిగిపోవడం వంటి కారణాలతో వాటి నిర్వహణ కష్టతరంగా మారింది. రాబోయే కాలంలో ఇలాంటి సమస్యలు లేకుండా రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ పాత దస్తావేజుల డిజిటలీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బుక్ 1,2,3,4 ఇండెక్స్ 1, 2 పుస్తకాలు వాల్యూమ్స్ రూపంలో ఉంటాయి. బుక్ 1లో పార్టేషన్ డీడ్లు, సేల్ డీడ్లు, తనఖా, గిఫ్ట్‌డీడ్లు ఉంటాయి. బుక్ 2లో తిరస్కరించినవి.. బుక్ 3లో వీలునామాలు, బుక్ 4లో దత్తత స్వీకరణ, పవర్ ఆఫ్ అటార్నీ వంటివి నమోదు చేస్తారు. ఒక్కో వాల్యూమ్‌లో 200 నుంచి 500 పేజీల వరకు ఉంటాయి. పుత్తూరు,



తిరుపతి, శ్రీకాళహస్తి, ప్రాంతాల్లో అయితే ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఉన్నప్పటినుంచి కార్యాలయాలు ఉన్నాయి. పుత్తూరులో 1854లోనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రికార్డులు స్కాన్ చేసి ఆన్‌లైన్ చేస్తున్నారు. 1884 నుంచి 1999 వరకూ ఆయా రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు అనుసరించి ఉన్న రికార్డులను ఒక్కో పేజీలో స్కాన్ చేసి డిజిటలైజేషన్ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని రిజిస్ట్రారు కార్యాలయాల్లో అక్కడ ఉన్న రిజిస్ట్రేషన్లను బట్టి సిబ్బందిని నియమించి స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. స్కానింగ్ చేసిన దస్తావేజులను సిబ్బంది పరిశీలించి ప్రతులను సంవత్సరాల వారీగా ఇండెక్సు రూపొంది స్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రారు, డీఐజీ ఆమోదంతో వాటిని ఆన్‌లైన్లో పొందుపరుస్తారు. మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# పోలవరం అక్రమార్కులపై ఉచ్చు

రాజమహేంద్రవరం:పోలవరం ప్రాజెక్టు కోసం ఆవాసాలు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రకటించిన పరిహారం కొంతమంది అక్రమార్కులకు వరంగా మారింది. భారీ స్థాయిలో స్వాహా చేసి అర్హులకు మొండిచేయి చూపిన ఉదంతాలు బయటపడ్డాయి. వైకాపా నాయకులు, కొందరు అధికారులు కలిసి అక్రమాలకు పాల్పడడంతో గత ప్రభుత్వంలో ఈ కేసు నివేదికను తొక్కిపెట్టారు. ఇప్పుడు కూటమి ప్రభు త్వం రావడంతో అక్రమార్కులపై చర్యలకు నిర్ణయించారు. అప్పటి స్పెషల్ కలెక్టర్ ఇ.మురళిపై అభియోగాల నమోదుకు తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. పరిహారం పంపిణీలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేపట్టాలని అప్పటి పరిపాలనాధికారి ప్రవీణ్ ఆదిత్యను నాటి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. దర్యాప్తు పూర్తిచేసి నివేదికను సిద్ధంచేశారు. ధవళేశ్వరంలోని పోలవరం ఎల్ఎంసీ యూనిట్-1లో పనిచేస్తున్న ఓ అధికారికి ఆ నివేదికను కలెక్టర్‌కు పంపే బాధ్యత అప్పగించారు. అప్పటి స్పెషల్ కలెక్టర్ ఇ.మురళి చక్రం తిప్పి నివేదిక పంపకుండా తొక్కిపెట్టారు. దేవీపట్నం మండలం కోయలవీరవరంలోని ఊరకొండ, పరిసర ప్రాంతాల్లో 82.37 ఎకరాల భూమికి సంబంధించి 15 నకిలీ డీ-పట్టాలను ఫోర్జరీ సంతకాలతో సృష్టించారు. 21 మంది అనర్హుల



పేరిట రూ 6.17 కోట్లు పరిహారం అక్రమంగా పొందారు. రూ.19.52 కోట్ల మేర అక్రమ చెల్లింపుల వ్యవహారంలో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన అధికారులు.. అది రద్దయి మళ్లీ వెళ్లే పరిస్థితి ఉండటంతో ధవళేశ్వరం ఎల్ఎంసీ యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి ద్వారా ఆ నివేదికను తొక్కిపెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దస్త్రాలు దహనం చేశారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. రూ.19.52 కోట్ల పరిహారం పంపిణీలో ఆరోపణలతో సస్పెండైన గత స్పెషల్ కలెక్టర్ మురళిపై రోజుకో వివాదం రాజుకుంటోంది.

# బఫర్ జోన్లలో యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారం



**తిరుపతి,తెలంగాణ దిశ:** చెరువులు,కుంటలు, వాగులు, కాల్వలను చెరబడితే ఎంతటి విలయం ముంచుకొస్తుందో ఇటీవల విజయవాడతో పాటు తెలంగాణా లోని పలు పట్టణాల్లో చూశాం.. వీటిని ఆక్రమిస్తే నీరు వెళ్లే దారి లేక రహదారులపైనే నిల్చిపోయాయి. దీన్ని గుణపాఠంగా తీసుకుని రానున్న రోజుల్లో చెరువులు కబ్జా కాకుండా చూడటంతోపాటు వీటికి ఆనుకుని ఉన్న బఫర్ జోన్లలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా నిరోధించాల్సి ఉంది. వీటిని అరికట్టడంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు విఫలమవుతున్నారు. చెరువులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నా, నకిలీ రైత్వారీ పట్టాలు సృష్టించి వీటిని కొట్టేసేందుకు యత్నిస్తున్నారు. ఇందుకు కొందరు రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్లు సహకరిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలా చెరువులను పలువురు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. ఇప్పటికైనా చెరువులను కాపాడటంతోపాటు బఫర్ జోన్‌ను కాపాడు కుంటే రానున్న రోజుల్లో ముంపును నివారించవచ్చు. భవిష్యత్తులో విపత్తులు సంభవిస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు చెరువులు, కుంటలు, కాల్వలను ఆనుకుని బఫర్ జోన్లను నిర్ణయిస్తారు. 2017లోనే భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లోనే చెరువుల వద్ద ఏ మేరకు బఫర్ జోన్ ఉండాలనే నిబంధ నలు విధించింది. అయితే వైకాపా ప్రభుత్వ హయాంలో నిబంధనలు తుంగలో తొక్కి చెరువుల వద్దనే పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. తిరుపతిని ఆనుకుని సర్వే నంబరు 261లో మొత్తం 86.20 ఎకరాల విస్తీర్ణంలో వెంకటాపురం చెరువు ఉంది. కొంత భాగం రహదారి నిర్మా ణానికి తీసుకున్నారు. తర్వాత సర్వే నంబరుకు మూడు సబ్‌డి విజన్లు ఇచ్చారు. కొందరు అక్రమార్కులు 261/4 అనే కొత్త సర్వే నంబరును తెచ్చి 6.50 ఎకరాల భూమిని 1975లో మాజీ సైనిక ఉద్యోగులకు ఇచ్చినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. 2010లో భూముల రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా అప్పటి రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ దస్త్రాలను పెండింగ్‌లో ఉంచారు. అనంతరం 2022 అక్టోబరులో ఈ భూమికి రిజిస్ట్రేషన్ చేశారు. తిరుపతి సమీపంలోని మంగళం చెరువులో తొమ్మిది ఎకరాలకు కొందరు నకిలీ రైత్వారీ పట్టాలు సృష్టించారు. సర్వే నంబరు 6లో మొత్తం 75.98 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. కొందరు ఒక పట్టా ఎస్.ఆర్. నంబరు సత్యవేడు పరిధిలోని పొందుపర్చారు. తిరుపతి పక్కనే ఉన్న కరకంబాడి చెరువు సుమారు 128 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇప్పుడు చెరువును ఆనుకుని పెద్ద ఎత్తున స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. కనీసం బఫర్ జోన్ లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానిక సంస్థ వెలుపల చెరువుకు వంద మీటర్లు బఫర్ జోన్‌గా నిర్ణయించారు. స్థానిక సంస్థలో అయితే 50 మీటర్ల విస్తీర్ణం వరకు బఫర్ జోన్ కింద వదలాలి.

## స్మార్ట్ టౌన్‌షిప్ ప్రాజెక్టుకు

# కూటమి ప్రభుత్వంలో కదలిక



**కాకినాడ,తెలంగాణ దిశ:**మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేస్తామని..నగరాలు, పట్టణాల్లో స్తిరాస్థి వ్యాపారుల కంటే తక్కువ ధరలకుఇంటి స్థలాలు అందిస్తామని గత వైకాపా ప్రభుత్వం ఊదరగొట్టింది. ఎంఐజీ లేఅవుట్లలో గృహాల కోసం పెద్దఎత్తున మధ్య ఆదాయ వర్గాల ప్రజలు దరఖాస్తులు అందించారు. అప్పటికే ఉన్న భూములు జగనన్న కాలనీల పేరుతో ఊడ్చేయడం.. మరికొన్ని ఆక్రమణలు, న్యాయ వివాదాల్లో ఉండటంతో.. అందిన దరఖాస్తులకు ఎంత భూమి అవసరమో గు ర్తించినా కీలక ప్రాజెక్టు పట్టాలెక్కించలేకపోయింది.

అప్పట్లో అసం పూర్తిగా నిలిపేసిన స్మార్ట్ టౌన్‌షిప్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం కొనసాగించాలని నిర్ణయించడంతో మళ్లీ ఆశలు మొలకెత్తాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు 2021లో వైకాపా ప్రభుత్వం ఎంఐజీ గృహాల లేఅవుట్లకు దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. 150, 200, 240 చ.అ చొప్పున కేటగిరీల్లో 16, 12, 10 చొప్పున ప్లాట్లు వచ్చేలా ప్రణాళికలు సిద్ధంచేశారు. అప్పట్లో 46,236 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇళ్ల నిర్మాణానికి 3,792.48 ఎకరాల భూమి అవసరమని యంత్రాంగం అంచనాకు వచ్చింది. ఇదే సమయంలో జగనన్న కాలనీల కోసం ప్రభుత్వ, పారిశ్రామిక స్థలాలన్నీ పెద్ద ఎత్తున సేకరించడంతో.. ఎంఐజీ టౌన్‌షిప్‌లకు భూ సమస్య తెరమీదికి వచ్చింది. కాకినాడ నగరంలో ప్రభుత్వ స్థలాలు లేక.. పెద్దాపురం,జగ్గంపేట, ఏలేశ్వరంలో వెతికారు. తునిలో గుర్తించినా..స్థిరాస్తి వ్యాపారులు అమ్మే ధర కంటే ఎక్కువ వెచ్చించాల్సి రావడంతో చేతు లెత్తేశారు. రాజానగరంలోని వెలుగుబంద, రాజవోలు, కొవ్వూరు, నిడ దవోలు తదితర ప్రాంతాల్లో భూములు ఎకరం రూ.కోటికి పైనే పలికింది. ఇంత ఖరీదు పెట్టి సేకరించినా.. అభివృద్ధి చేసి ప్లాట్లుగా మారిస్తే.. ధర మరింత పెరిగే అవకాశం ఉండి ముందుకు వెళ్లలేకపో యారు.అయినవిల్లి మండలం నేదునూరు, అమలాపురం మండలం పేరూరు వై కూడలి వద్ద భూములదీ అదే పరిస్థితి. దీంతో స్మార్ట్ టౌన్‌షిప్ అటకెక్కింది. వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఎంఐజీ లేఅవుట్లలో పెండింగ్ పనుల పూర్తికి

కూటమి ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేయడంతో ప్రాజెక్టు పట్టాలెక్కినట్లేనన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అప్పట్లో రూ.3 లక్షల నుంచి రూ.18 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ ప్లాట్లు కేటా యించాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుత జిల్లా కేంద్రాలు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన పట్టణాల్లోనూ స్పందన కనిపించింది. ఆ దరఖాస్తులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వేలాది ఎకరాల భూసేకరణతో అంశం ముడిపడి ఉన్నందున అడుగులు పడనిచోట పరిస్థితి ఏమిటన్న చర్చ నడుస్తోంది.

# నీరుగారుతున్న 'ఉద్యాన' లక్ష్యం



సింహాద్రిపురం: పండ్ల తోటల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఉద్యాన విస్తరణ పథకం గత ప్రభుత్వ హయాంలో అరకొరగా నిధులు కేటాయింపుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన వన పంటలు విస్తరించాలని లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ పథకానికి నిధులు కేటాయింపు జరగకపోవడంతో లక్ష్యం నీరుగారి పోయింది. గత ఐదేళ్లుగా కేవలం అరకొరగా మాత్రమే నిధులు కేటాయించారు. అర్హత కలిగిన రైతులకు పథకం లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ పథకం ద్వారా చీనీ, నిమ్మ, జామ, దానిమ్మ, అరటి, బొప్పాయి లాంటి తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహంగా సాగు చేసే రైతులకు ఆర్థిక సహాయం అందేది. టమోటా, కలింగర, లాంటి స్వల్పకాలిక పంటలలో మల్చింగ్ సీట్ వేసుకునే రైతులకు సైతం ప్రోత్సాహం లభించేది. మరింత విస్తీర?ంలో పంట సాగుకు ఉపయోగకరంగా ఉండేదని రైతులు చెబుతున్నవారు. గతంలో నూతనంగా చీనీ, నిమ్మ సాగు చేసే రైతులకు రెండు సంవత్సరాలకు కలిపి హెక్టార్‌కు రూ.16,004, అరటికి హెక్టర్‌కు రెండు సంవత్సరాలకు కలిపి రూ.40,700, దానిమ్మకు మూడు సంవత్సరాలకు కలిపి రూ.18 వేలు, బొప్పాయికి రెండు సంవత్సరాలకు రూ.25 వేలు చొప్పున ప్రోత్సాహం కింద రైతులకు ప్రభుత్వం అందించేది. ఈ పథకం నీరుగారిపోవడంతో సాగు చేసే రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరణ చేయాలని ఉద్యాన వన తోటల రైతులు కోరుతున్నారు.విస్తారంగా అరటి సాగు కొన్ని సంవత్సరాల నుంచి వేరుశనగ, పొద్దుతిరుగుడు లాంటి వాణిజ్య పంటలు సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాల కారణంగా ఉద్యానవన పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 450 హెక్టార్లలో అరటి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఇటీవల కాలంలో అరటి మొక్కలు ధరలు పెరగడంతో పాటు పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ తరుణంలో పథకం పునరుద్ధరణ చేపడితే మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఉద్యానవన రైతులు చెబుతున్నారు. అరటి కాయలు విదేశాలకు ఎగుమతి కారణంగా రాష్ట్ర జిడిపి సైతం పెరిగే అవకాశం ఉందని కావున ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుని పథకాన్ని పునరుద్ధరణ చేయాలని రైతులు కోరుతున్నారు.కొత్తగా సాగు చేసే రైతులకు కాస్త ఊరట అరటి సాగు చేసే రైతులకు ఈ పథకం కాస్త ఊరటగా ఉంటుంది. ఇటీవల కాలంలో అరటి సాగు పెట్టుబడి వేయడం ఖర్చులు భారీగా పెరిగాయి. కావున ప్రభుత్వాలు తిరిగి ఈ పథకాన్ని పునరుద్ధరణ చేసినట్లయితే కాస్త ఊరటగా ఉంటుంది.

రవిశంకర్, అరటి రైతు, గురజాల.చీనీ, అరటి రైతులకు ఎంతో ఉపయోగకరం నూతనంగా అరటి, చీనీ సాగు చేసే రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఉద్యాన విస్తరణ పథకం కింద పండ్ల తోటల రైతులు ఎంతో లబ్ధి పొందేవారు. ఈ పథకంలో అరకొరగా ఇవ్వడంతో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని పునరుద్ధరణ చేయాలి.- అనిల్ కుమార్‌రెడ్డి, చీనీ రైతు, బలపనూరు.

## ఆయిల్‌పాం పెంపకం..
# రైతులకు ఆదాయం



జఫర్‌గడ్, : వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్న ప్రధాన ఉద్దేశంతో ఆయిల్‌పాం తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహి స్తోంది. సాగుకు తక్కువ మొత్తంలో ఖర్చు కావడం, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుండడం, తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడం వంటి కారణాలతో రైతులు ఆయిల్‌పాం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పలుచోట్ల రైతులు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తుండడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మూడేళ్ల కిందట ఆయిల్‌పాం మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు మొత్తం 5,880 ఎకరాల్లో ఆయిల్‌పాం ను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా రైతులు ఇప్పటికే జిల్లాలో 200 ఎకరాల వరకు సాగుకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేలా ఉద్యానశాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆయిల్‌పాం సాగు వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వంటి అంశాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు రైతులకు పలు రాయితీలు ఇస్తున్నాయి. ఒక్కో మొక్క ఖరీదు రూ.193 కాగా, రాయితీ పోను రైతులు రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మొదటి ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు ఎకరానికి తోటకు వాడే ఎరువులు, పురుగు మందులు, నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ.2,100లతో పాటు అంతర పంటలు సాగు చేసుకునే వారికి మరో రూ.2,100 చొప్పున చెల్లిస్తారు. అంటే నాలుగేళ్లలో నిర్వహణ, అంతర పంటల కోసం ఎకరానికి రూ.16,800 చెల్లిస్తారు. ఈ పంట సాగుకు బిందు సేద్యం పద్ధతిలో నీరు అందించాల్సి ఉంటుంది. ఈ బిందు సేద్యానికి కూడా రాయితీ కల్పిస్తారు. ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ఏటా అందించే నిర్వహణ(ప్రోత్సాహక) నిధులు ఎట్టకేలకు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు రావడం, కోడ్ అమలులో ఉండడం, ప్రభుత్వం మారిపోవడంతో గత ఏడాది నుంచి నిధులు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

కాగా, రెండో ఏడాది (2022-23) ఆయిల్ పాం సాగు రైతులకు రావాల్సిన నిర్వహణ నిధులు జిల్లాలోని 3,200 ఎకరాలకు గాను ప్రస్తు తం 2,850 ఎకరాలకు, 915 మంది రైతులకు మొత్తం రూ.1.15 కోట్ల నిధులు వారి ఖాతాల్లో జమ అయ్యాయని సంబంధిత శాఖ అధికారు లు తెలిపారు. మిగతా 350 ఎకరాలకు నిధులు వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని నర్సరీలో ఆయిల్‌పాం మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. 5వే ల ఎకరాల వరకు సాగు చేసేందుకు సుమారు 3.30 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన శాఖాధికారి కేఆర్.లత తెలిపారు. సాగుకు ఆసక్తి కనబరిచి దరఖాస్తు చేసుకున్న రైతులకు మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఆయిల్‌పాం మార్కెటింగ్ కోసం ఆరు నెలల్లోగా జిల్లాలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

# నిత్యావసర వస్తువుల పక్కదారికి చెల్లు

**కరీంనగర్,తెలంగాణ దిశ:**జిల్లాలోని కేజీబీవీలు,ఆదర్శ పాఠశాల ల్లోని బాలికల వసతిగృహాలను మరింత సమర్థంగా నిర్వహించేం దుకు ప్రభుత్వం సంకల్పిం చింది. ముఖ్యంగా నిత్యావసర సరకుల విషయంలో పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటి వరకు సరకుల వినియోగం, వాటి సరఫరా వంటి వివరాలను కాగితాలపై నమోదు చేస్తుండటంతో కొన్నిసార్లు వాటి విషయంలో తేడాలు, కొన్ని చోట్ల అవి పక్కదారి పడుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు వాటి వివరాలు కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు తెలిసేలా ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొస్తుంది. హాస్టల్ మేనేజ్‌మెంట్ యాప్ పేరుతో దాని రూపకల్పన దాదాపు పూర్తి కావొచ్చింద%రి%ని సమాచారం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి దీన్ని వాడకంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాళ్లకు, ఆయా విద్యాసంస్థల్లోని విభాగాలు నిర్వహించే బాధ్యులకు యాప్ నిర్వహణ విషయమై శిక్షణ అందించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 49 కేజీబీవీలు, 38 ఆదర్శ పాఠశాల లున్నాయి. వాటిల్లోని బాలికల వసతిగృహాలను కేజీబీవీల ప్రిన్సిపాళ్లు పర్యవేక్షిస్తున్నారు. వీటికి నిత్యావసర సరకులు, కూరగాయలు తదితర సామగ్రిని జిల్లా స్థాయిలో టెండర్లు పిలిచి గుత్తేదారులను ఎంపిక చేసి సరకులు అందిస్తున్నారు. ప్రతి రోజు వచ్చిన సరకుల ప్రారంభ నిల్వ, వినియోగించాక ముగింపు నిల్వను రికార్డుల్లో రాస్తున్నారు. ఈ విద్యాల యాల్లోని అకౌంటెంట్లు ఈ విధులను నిర్వహిస్తున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారుల సందర్శనలో సదరు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాలయాల్లో సరకుల కొరత, నిల్వల్లో తేడాలు వంటివి అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. కొన్ని సార్లు సరకుల వివరాల నమోదును రాయకుండా ఉన్న సందర్భాలు వెలుగులోకి వ చ్చాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టి వాటి ఉపయోగాన్ని, నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చేందుకు తీసుకొస్తున్న యాప్ ద్వారా రోజూ సమగ్ర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మొదట కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని మౌలిక వసతులను యాప్‌లో నమోదు చేయాలి. ఇందుకు ప్రత్యేకాధికారులు అభ్యాసం చేస్తున్నారు. నిత్యం విద్యార్థుల సంఖ్య, క్రితం రోజు ముగింపు నిల్వ, ఆ రోజు ప్రారంభ నిల్వగా పేర్కొంటూ, ఏరోజుకారోజు గుత్తేదారు అందించిన సరకుల వివరాలు, ఎంతమేర వంటలకు వినియోగించింది. రాత్రి భోజనం తర్వాత ఎంత సరకు నిల్వ ఉందో ముగింపు నిల్వలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ విషయంలో తేడాలుంటే అధికారుల సందర్శనలో చర్యలుంటాయి. గుత్తేదారు సకాలంలో సరకులు తెస్తున్నారా? లేదా? అనేది ఉన్నతాధికారులు నిత్యం గమనించే అవకాశముంది. రోజు వారీ నిర్వహణలో నగదు చెల్లించాల్సి వస్తే ఆ వివరాలు కూడా నమోదు చేసేలా వీలు కల్పిస్తున్నారు.

# ముందుకు పడని అడుగు..!



**హిందూపురం,తెలంగాణ దిశ:**హిందూపురం రూరల్ మండలంలోని పలు గ్రామాలు హిందూపురం పట్టణానికి, కర్నాటకలోని అనేక గ్రామాలకు రాకపోకలకు స్థానిక పోచనపల్లి వద్ద పెన్నా నది మీద ఉ న్న వంతెనే ఆధారం. దీనిని 70 ఏళ్ల కిందటే అప్పటి పాలకులు నిర్మించారు. అప్పటి నుంచి నేటి దాకా కనీస మరమ్మతులు సైతం చేయలేదు. నాలుగుసంవత్సరాల క్రితం పెన్నా ఉధృత ప్రవాహానికి వంతెన మధ్య భాగం దెబ్బతింది. అప్పటి నుంచి మరమ్మతులు చేయించాలని ఈ ప్రాంత ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గత వైసిపి ప్రభుత్వ హయాంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో రెండున్నర ఏళ్ల కిందట రూ.80 లక్షలు మంజూరయ్యేలా చూశారు. ఈ నిధులతో వంతెన దెబ్బతిన్న పునర్నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పెన్నా నది ప్రవాహానికి వంతెన మధ్య భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఆయా గ్రామాలకు, పట్టణానికి రాకపోకలు నిలిచిపోయా యి. ఈ విషయం తెలియకుండా ఆ సమయంలో కర్నాటక ప్రాంతం నుంచి ఒక వ్యక్తి హిందూపురం పట్టణానికి వస్తూ వంతెన దెబ్బతిన్నచోట నుంచి కిందికి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సమీప గ్రామ ప్రజల డిమాండ్ మేరకు కూలిన వంతెన వద్ద రాకపోకలను పునరుద్ధరించడా నికి రెండేళ్ల కిందట తాత్కాలిక ంగా రూ.10 లక్షలతో ఇనుప వంతెన నిర్మించారు.

దీనిపైన ద్విచక్రవాహ నాలు, సైకిళ్లు పోవడానికి, పాదచారులు నడిచి వెళ్లడానికిఅవకాశం దక్కింది. భారీ వర్షాల సమయంలోనూ, నది ఉ ధృతంగా ప్రవహిస్తున్న సమయంలోనూ తాత్కాలిక వంతెన పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం తో పట్టణానికి చెందిన ఓ గుత్తేదారుడు పనులు చేశారు.

ఆయనకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. బిల్లు కోసం అధికారుల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో పెన్నా నది ప్రవాహానికి వంతెనమధ్య భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతోఆయా గ్రామాల కు, పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలియకుం డా ఆ సమయంలో కర్నాటక ప్రాంతం నుంచి ఒక వ్యక్తి హిందూపురం పట్టణానికివస్తూ వంతెన దెబ్బతిన్నచోట నుంచి కిందికి పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

# అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన మోదీ..!



'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహా మహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు. ఒక దశాబ్ద కాలం (2014-24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉ న్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమో నని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చె ప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయకముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు! రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. ఆయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వాక్రుచ్చారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు. నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిఎ ంచింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకో ంమో అనిపించిం ది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపో యినట్లు అర్థమ వుతోంది. నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆపార్టీలో సీనియర్ నాయకు డు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణ మూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాం టి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయి నట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నిక ల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూట మికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకఛత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది. ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న పైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు.

ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమో దీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు.

## త్వరలో పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు!
### పలు మార్గాల్లో రైళ్ళను నడపడానికి ప్రణాళిక సిద్ధం

న్యూఢిల్లీ: భారత్‌లో హైడ్రోజన్‌తో నడిచే రైళ్లు త్వరలో పట్టాలెక్కనుంది. ఈ క్రమంలో.. జర్మనీకి చెందిన రైలు భద్రతకు సంబంధించి సేఫ్టీ ఆడిట్ నిర్వహించనుంది. ఈ రైలు ట్రయల్ రన్ డిసెంబర్ 2024లో ప్రారంభమవుతుందని సమాచారం. జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనాలో హైడ్రోజన్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా ఈ జాబితాలో చేరనుంది. హైడ్రోజన్ రైలు ఒక్క యూనిట్ ఖరీదు రూ.10 కోట్లకు పైగా ఉంటుంది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. రైల్వే మొదట 35 రైళ్లను నడపనుంది. ఒక్కో రైలుకు రూ.80 కోట్లు ఖర్చవుతుంది. దీని గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సిద్ధం చేయడానికి రూ.70 కోట్లు వెచ్చించనున్నారు. సిస్టమ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్ బ్యాటరీ, రెండు ఇంధన యూనిట్లను విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ రైలును మొదట జింద్-సోనిపట్ సెక్షన్‌లో నడపనున్నట్లు సమాచారం. హర్యానాలోని రైళ్లకు హైడ్రోజన్ జింద్‌లో ఉన్న 1 పాలిమర్ ఎలక్ట్రోలైట్ మెమ్బ్రేన్ ఎలక్ట్రోలైజర్ నుండి అందించబడుతుంది. ఇక్కడ ప్రతిరోజూ దాదాపు 430 కిలోల హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. 3000 కిలోల హైడ్రోజన్ నిల్వ సామర్థ్యం కూడా ఉంటుంది. హైడ్రోజన్ రైలు హైడ్రోజన్ ఇంధనంతో నడుస్తుంది. ఇందులో ఇంజన్ స్థానంలో హైడ్రోజన్ ఇంధన కణాలు అమర్చబడి ఉంటాయి. ఈ రైళ్లు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ లేదా పార్టిక్యులేట్ మ్యాటర్ వంటి కాలుష్య కారకాలను విడుదల చేయవు. దీని వల్ల కాలుష్యం ఉండదు. హైడ్రోజన్ ఇంధన కణాల సహాయంతో, హైడ్రోజన్ ఇంధనాన్ని ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేయబడుతుంది. ఈ రైలును హైడ్రైల్ అని కూడా అంటారు. ఈ రైలులో నాలుగు కోచ్‌లు ఉండనున్నట్లు తెలుస్తోంది. నీలగిరి మౌంటైన్ రైల్వే, డార్జిలింగ్ హిమాలయన్, కల్కా సిమ్లా రైల్వే, కాంగ్రా వ్యాలీ, బిల్మోరా వాఘై మరియు మార్వార్ దేవ్‌గర్ మదారియా మార్గాల్లో ఈ రైలును నడపడానికి ప్రణాళిక ఉంది. ఈ రైలు గంటకు 140 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. ఈ రైలు కారుపాతల, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమవుతోంది. డీజిల్ రైలుతో పోలిస్తే ఈ రైలు నడపడానికి ఎక్కువ ఖర్చు అవుతుంది. అయితే.. పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. గ్రీన్ హైడ్రోజన్ కిలోకు దాదాపు రూ.492 ఉంటుంది. ఈ రైలు నిర్వహణ డీజిల్ రైలు కంటే 27 శాతం ఖర్చుతో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. ఫ్రెంచి కంపెనీ తొలిసారిగా హైడ్రోజన్ రైలును సిద్ధం చేసింది. 2018 నుంచి అక్కడ హైడ్రోజన్ రైలు నడుస్తోంది.

# ముంబయి పోలీసుల పేరుతో వైద్యుడికి బెదిరింపు



ధర్మవరం:ముంబయి పోలీసుల పేరుతో ధర్మవరం పట్టణానికి చెందిన వైద్యుడు సూర్యనారాయణరెడ్డిని వాట్సప్ వీడియో కాల్ ద్వారా బెదిరించి రూ.33 లక్షలు ఖాతాలో జమ చేయించుకున్న ఐదుగురు సైబర్ నేరగాళ్లను ధర్మవరం 1వ పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఎస్పీ వి.రత్న వెల్లడించారు. గతనెల 18వ తేదీన వైద్యుడు సూర్యనారాయణరెడ్డికి ముంబయి పోలీసునంటూ ఒకవ్యక్తి వాట్సప్ వీడియోకాల్ చేశాడు. నరేష్ గోయల్ అనేవ్యక్తి కెనరాబ్యాంకు ద్వారా రూ.500 కోట్లు అప్పుగా తీసుకున్నాడని, డబ్బులు సంస్థకు వాడకుండా వివిధ ఖాతాల్లో జమ చేశాడని.. అందులో మీ ఖాతా కూడా ఉందని చెప్పాడు. రూ.20 లక్షలు కమీషన్ తీసుకున్నారంటూ వాట్సప్ వీడియోకాల్‌లో వైద్యుడిని బెదిరించాడు. రూ.33 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, లేదంటే అరెస్టు చేసి ముంబయికి తీసుకువెళతామని హెచ్చరించాడు. దీంతో ఆందోళనకు గురైన వైద్యుడు రూ.20 లక్షలు ఒకసారి, రూ.13 లక్షలు మరోసారి మొత్తం రూ.33 లక్షలు సైబర్ నేరగాళ్లు ఇచ్చిన బ్యాంకు ఖాతాకు జమ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మంగమద్దెల ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఉన్న ఖాతాలో నిధులు జమయ్యాయి. ఇంకా డబ్బు ఇవ్వాలని తరచూ వాట్సప్ వీడియో కాల్ చేస్తూ బెదిరిస్తుండటంతో వైద్యుడు ధర్మవరం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, ధర్మవరం 1వ పట్టణ పోలీసులతో ఎస్పీ ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. వారి దర్యాప్తులో ఐదుగురు సైబర్ నేరస్థులు పట్టుబడ్డారు. అరెస్టయిన వారిలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసి ఇలియాజర్, నంద్యాల జిల్లాకు చెందిన మంగమద్దెల ప్రహ్లాద్, నంద్యాల వెంకటాచలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన బెలగడ కిశోర్, బాపట్ల జిల్లా చెరకుపల్లి మండలం గూడవల్లికి చెందిన జావీద్ ఉన్నారు. దాసి ఇలియాజర్, జావీద్ బీ.టెక్ వరకు చదివి ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు. వైద్యుడిని ముంబయి పోలీసు పేరుతో బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వైద్యుడి నుంచి జమ చేయించుకున్న రూ.33 లక్షలు రికవరీ చేసే యత్నంలో ఉన్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసులు, ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు, 1వ పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్, సైబర్ క్రైమ్ సీఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ గ్రేడుల్లో గందరగోళం



నరసరావుపేట: రొంపిచర్ల మండలం తురిమెళ్ల జనాభా 1560 ఉండగా దానిని ఇటీవల అధికారులు గ్రేడ్ వన్ పంచాయతీగా, ఇదే మండలంలోని వి.రెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో సుమారు 5,500 మంది జనాభా ఉంటారు. దానిని అధికారులు గ్రేడ్-4 పంచాయతీగా ప్రకటించారు. జనాభా, ఆదాయం అనుసరించి జిల్లాలోని గ్రామ పంచాయతీల గ్రేడ్లను మార్చినట్లు ప్రకటించారు. అయితే ఇష్టానుసారంగా అధికారులు ప్రకటించడంపై గ్రామ పంచాయతీల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయనడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. జిల్లాలో జనాభా, ఆదాయ వనరుల ఆధారంగా పంచాయతీలకు గ్రేడ్లు కేటాయించారు. అయితే అర్హత ఉన్నా గానీ చాలా పంచాయతీలు గ్రేడ్-1 హోదా సాధించలేకపోయాయి. చాలా పంచాయతీలకు గ్రేడ్-1 స్థాయి ఉన్నప్పటికి గ్రేడ్-2, 3, 4, 5లో ఎక్కువ పంచాయతీలు ఉన్నాయి. గతంలో మైనర్ పంచాయతీలు రెండు, మూడు కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి వాటిల్లో పెద్ద పంచాయతీకి గ్రేడ్ వన్ కల్పించి ఒక కార్యదర్శిని నియమించారు. 2011లో ఈ పంచాయతీల హోదాలను అధికారులు తారుమారు చేశారు. గ్రేడ్-5 పంచాయతీలను గ్రేడ్-3, 4లో కలిపేశారు. క్లస్టర్‌గా ఏర్పడిన మైనర్ పంచాయతీలను విడగొట్టారే గాని వాటిల్లో ఒక గ్రామానికి ఉన్న గ్రేడ్-1 హోదాను మాత్రం తొలగించలేదు. ఫలితంగా చాలా మైనర్ పంచాయతీలు గ్రేడ్-1 హోదాలో కొనసాగడం విశేషం. మేజర్ పంచాయతీలు ఆ హోదాను కోల్పోయాయి. నరసరావుపేట మండలం పరిధిలో గ్రేడ్ వన్ హోదా ఒక రావిపాడు పంచాయతీకి మాత్రమే దక్కింది. జనాభా, ఆదాయపరంగా పెద్ద గ్రామాలైన యల్లమంద, ఇసప్పాలెం, కేశానుపల్లి, జొన్నలగడ్డ తదితర గ్రామాలు గ్రేడ్-3 హోదా కల్పించారు. ఉన్న శావల్యాపురం, ఈపూరు, బెల్లంకొండ, ముప్పాళ్ల తదితర పంచాయతీలకు గ్రేడ్ వన్ హోదా తీసి వేసి గ్రేడ్-3, 4 హోదా కల్పించారు. శావల్యాపురానికి గ్రేడ్-4 హోదా కల్పించడం గమనార్హం. ఇప్పటికైనా పంచాయతీ ఉన్నతాధికారులు జరిగిన తప్పు లను చక్కదిద్ది అర్హతలను బట్టి గ్రేడ్లను కేటాయించాలని గ్రామీణులు కోరు తున్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు గ్రేడ్లు కేటాయింపు ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న గుంటూరులో జరిగిందని తప్పులు ఉంటే పరిశీలిస్తామన్నారు.

# ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాల్సిందే..



జిల్లా సచివాలయం: ఆయకట్టు కింద ఉన్న ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలి. ప్రతి ఇంజినీరు క్షేత్ర స్థాయిలో తిరగాలి. సరఫరా వ్యవహారంలో అన్నదాతలను నష్టపరచాలని చూస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదు'..అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. అనంత కలెక్టరేట్లో కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం జరిగింది. తొలుత హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ నీటి వాటా, ఏయే కాలువకు ఎన్ని టీఎంసీలు కేటాయించారన్న దానిపై వివరించారు. తర్వాత మంత్రి కేశవ్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో నీటి ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులకు పైసా ఇవ్వలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను తప్పు పట్టే మనస్తత్వం కాదు మాది. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం దేవుడెరుగు.. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల కోసం నిధులు సమకూరుస్తామని మంత్రి అన్నారు. ప్రణాళిక ప్రకారం సరఫరా ప్రక్రియ కొనసాగిస్తే చివరి భూములకు నీరు ఇవ్వవచ్చు. రానున్న మూడు మాసాలు అధికారులు కష్టపడాలి. ఇంజినీర్లు అందరూ కలిసి వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని నీటి నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. హెచ్చెల్సీ నీటి నిర్వహణపై దృష్టి సారించి పని చేయాలని మంత్రి కేశవ్ అన్నారు. హంద్రీనీవా, ఇతరాత్ర ప్రాజెక్టులపై లోతుగా చర్చించేందుకు ఈనెల 22, 23న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వస్తున్నారు. 22న అనంతలోనే ఉంటారు. అవసరమైతే 23న మరొకసారి చర్చిద్దామన్నారు. రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నీటి ప్రాధాన్యం బాగా తెలుసు. తన నియోజకవర్గ పరిధిలో పీఏబీఆర్ కుడి కాలువ ఉంది. నీరు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదాతలకు అండగా ఉండటానికి అందరూ కృషి చేయాలి. కేంద్ర పథకాల కోసం నిధులు తేవడానికి తాను బాధ్యత తీసుకుంటానన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, అస్మిత్‌రెడ్డి, దగ్గుపాటి ప్రసాద్, ఎస్పీ జగదీశ్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈలు రాజశేఖర్, దేసేనాయక్, విశ్వనాథ్‌రెడ్డి, ఆర్డీఓలు రాణి సుస్మిత, వసంతబాబు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్ మినహా తక్కినవారు హాజరు కాలేదు. ఆహ్వానం పంపలేదన్న చర్చ సాగుతోంది. పొరుగున ఉన్న ఆలూరు, పులివెందుల ఎమ్మెల్యేలు, కడప ఎంపీ సైతం గైర్హాజరయ్యారు. ఎన్ని జలాలు వస్తాయి. ఏయే ప్రాంతాలు, జలాశయాలకు ఎన్ని కేటాయించాలి.. వంటి అంశాల ప్రస్తావనే లేదు.

# మట్టి అక్రమ తవ్వకాలు నిజమే?



అమరావతి:వైకాపా పాలనలో మట్టిమాఫియా రెచ్చిపోయింది. అధికారమే అండగా అడ్డగోలు తవ్వకాలు చేసి అక్రమార్జనకు పాల్పడ్డారు. పర్యావరణానికి తూట్లు పొడిచి సొంత జేబులు నింపుకున్నారు. స్థానికులు ఆందోళన చేసినా..అధికారులు అడ్డుకున్నా అక్రమ తవ్వకాలు మాత్రం ఆగలేదు. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతోనే చేబ్రోలు మండలంలో అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. నాణ్యమైన గ్రావెల్ లభిస్తుండడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి మట్టి తరలించారు. నియోజకవర్గ నేత అండదండలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేశారు. గోరంత అనుమతులు తీసుకుని కొండంత తవ్వకాలు చేశారు. రూ.కోట్ల జరిమానాలు వేస్తున్నా వెరవక అక్రమ తవ్వకాలు సాగించారంటే అక్రమార్కులు ఏస్థాయిలో ఆర్జన చేశారో వారికే తెలియాలి. ఇక్కడి నుంచి గ్రావెల్ తరలించి రూ.వందల కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో అప్పటి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేయడంతో వైకాపా ప్రభుత్వంలోనే అధికారుల బృందం తనిఖీలు చేసి నివేదిక ఇచ్చింది. వీరనాయకునిపాలెం, శేకూరు గ్రామాల పరిధిలో 2020 నుంచి 2022 డిసెంబరు వరకు మూడేళ్ల వ్యవధిలో జరిగిన తవ్వకాలను పరిశీలిస్తేనే లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తవ్వి తరలించినట్లు అధికారుల బృందం గుర్తించింది. రెండు గ్రామాల్లోనే ఈస్థాయిలో అక్రమ తవ్వకాలు జరిగితే వడ్లమూడి, శలపాడు, సుద్ధపల్లి తదితర ప్రాంతాల్లో ఎంతస్థాయిలో అక్రమాలు జరిగాయో నిగ్గు తేల్చాల్సి ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో చేబ్రోలు మండలంలో గత అయిదేళ్లలో జరిగిన మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ చేస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశంఉంది. వీరనాయకునిపాలెం,శేకూరు గ్రామాల్లో భూగర్భగనుల శాఖ నుంచి అనుమతి తీసుకుని నలుగురు తవ్వకాలు చేశారు. వీరంతా శేకూరులోనే అనుమతులు తీసుకున్నారు. 2020 నుంచి 2022 డిసెంబరు వరకు 22 మందికి తాత్కాలిక ప్రాతిపదికన అను మతులు ఇచ్చారు. తాత్కాలిక అనుమతుల ద్వారా 1,81,521 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వారు. ఇందుకు రూ.90,26,440 వసూలు చేశారు. 2019 నుంచి 2022 మధ్య అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించే వారి నుంచి రూ.1.10 కోట్ల జరిమానా భూగర్భగనుల శాఖ వసూలు చేసింది.

# పురంలో కుంటుపడిన పాలన





హిందూపురం : పారిశుద్ధ్యం పడకేయడంతో మురుగు కాలువల శుభ్రతకు నూతన ప్రభుత్వం రూ.1.3 కోట్లు మంజూరు చేసింది. వాటికి టెండర్లు పిలిచారు. గుత్తేదారుకు పనులు అప్పగించాలంటే కౌన్సిల్ ఆమోదం తప్పని సరి. ఇంటింటికీ నీటి సరఫరా కోసం నూతన పైప్‌లైన్ ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం నూతన ప్రభుత్వం రూ.120 కోట్ల మంజూరుకు అంగీకరించింది. సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి, పంపించాలని ఆదేశించింది. ఈ ప్రణాళిక తయారీని నిపుణులతో చేయించాలి. ప్రణాళిక తయారీకి కౌన్సిల్ ఆమోదం అవసరం. మున్సిపల్ పాలనను నడిపించడానికి ప్రతి నెలా కౌన్సిల్ సమావేశం నిర్వహణ తప్పని సరి. హిందూపురంలో ఎన్నికల కారణంగా మార్చి నెల నుంచి జూన్ వరకు సమావేశం జరగలేదు. జులైట్కులో జరిగినా వైకాపా సభ్యుల మెజార్టీ ఉండటంతో అధికారులు ప్రతిపాదించిన పనులను అడ్డుకొన్నారు. ఆగస్టులో ఛైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకోవడంతో, రాజీనామా ఆమోదానికి మాత్రమే సమావేశం పరిమితమైంది. నూతన ఛైర్మన్ ఎన్నిక తరువాత సమావేశం నిర్వహించాలని అధికారులు భావించారు. అయితే ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో ఛైర్మన్ ఎన్నిక ఆలస్యం అవుతోంది. వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించడానికి అవకాశం ఉంది. అయితే సమావేశ నిర్వహణకు ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. దీంతో నడిపించే వారు లేక మున్సిపల్ పాలన కుంటుపడింది. సమావేశం జరపాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు వచ్చినా, ఇటీవల వైకాపా నుంచి తెదేపాలో చేరిన కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. వైకాపాకు చెందిన వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహణకు వారు అంగీకరించడం లేదని తెలుస్తోంది. రాజకీయ విభేదాల కారణంగా పట్టణ ప్రగతికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. గొల్లపల్లి నుంచి పట్టణానికి నీటిని తీసుకొచ్చే తాగునీటి పథకంలో పంపుహౌస్‌ల వద్ద మోటార్లు, నియంత్రికలు సరిగా పని చేయడం లేదు. ఇన్‌టెక్ వెల్ వద్ద, మరో రెండు పంపు హౌస్‌లలో ఒకే ఒక్క మోటారు పని చేస్తున్నాయి. అవి ఏ క్షణమైనా నిలిచిపోవచ్చు. తాగునీటి పథకానికి అత్యవసరంగా మరమ్మతులు చేయించాల్సి ఉంది. ఈ పనుల కోసం గత ప్రభుత్వ హయాంలోనే 8 నెలల క్రితమే రూ.2 కోట్లు కేటాయించి, టెండర్లు పిలిచారు. అయితే సొంత పార్టీ కౌన్సిలర్లే అడ్డుకోవడంతో గుత్తేదారులకు పనులు కేటాయించలేదు. కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపితే, వెంటనే మరమ్మతుల పనులు చేయవచ్చు. పలు కాలనీల్లో మురుగు కాలువలు, చిన్నచిన్న రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు టెండర్లు పిలవాలంటే కౌన్సిల్ అనుమతి కావాలి. ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చినా, రాకపోయినా ఈ నెలలో కౌన్సిల్ సమావేశం తప్పని సరిగా నిర్వహిస్తాం. ఎన్నిక జరగకపోతే, వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. అభివృద్ధి పనులు, నిర్వహణ పనులకు కౌన్సిల్ ఆమోదం తీసుకొంటాం.

# నేతన్నలకు ఆధునిక శిక్షణ



మంగళగిరి:మారుతున్న సమాజానికి తగ్గట్టుగా నూతన డిజైన్లు ఉత్పత్తికి అవసరమైన శిక్షణ నేతన్నలకు ఇచ్చి వారు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. మంగళగిరిలో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన చేనేత వీవర్స్ శాలను పరిశీలించారు.కార్మికులకు లభిస్తున్న ఆదాయం, ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నేతన్నలు తన కుటుంబ సభ్యులని వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రి లోకేశ్ తనకు చెప్పినట్లు వివరించారు. నూతన డిజైన్లపై శిక్షణ ఇవ్వడంతో పాటు మంత్రి లోకేశ్ ఉపాధి కల్పిస్తున్నారన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి అమల్లోకి తెస్తామన్నారు. దసరా పండగ దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో చేనేత వస్త్ర విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు రూ.25 వేలు పరిహారం, నూలు కోసం అదనంగా మరో రూ.5 వేలు అందజేస్తామన్నారు. వీవర్స్ సర్వీసు సెంటర్ల ద్వారా 6 వేల మందికి, 5302 నూతన డిజైన్లు రూపొందించి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 375 శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, నాయకులు జానకీదేవి, దామర్ల రాజు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు

# డిసెంబరులో రాజధాని పనులు ప్రారంభిస్తాం



మంగళగిరి,:రాజధాని పరిధిలోని 29 గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తామని, త్వరలో అన్ని పనులు ప్రారంభమవు తాయని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిడమర్రు, కురగల్లు గ్రామాలకు చెందిన 10 మంది రైతులు 17 ఎకరాల భూమిని రాజధాని అవసరాలకోసం స్వచ్ఛందంగా భూ సమీకరణకు ముందు కొచ్చి అంగీకార పత్రాలను అందించారు. మంత్రి నారాయణ ఆ పత్రాలను స్వీకరించి సీఆర్డీఏ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 360 కి.మీ. రోడ్లు, సుమారు 3 వేల అంతర్గత రోడ్లు, అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం భవనాలు, అసెంబ్లీ, హైకోర్టు తదితర నిర్మాణ పనులను డిసెంబరులో ప్రారంభిస్తామన్నారు. '29 గ్రామాల్లో మూడు వేల ఎకరాలు ఇంకా భూ సమీకరణకు రావాల్సి ఉంది. కొంతమంది రైతులు ప్రస్తుతం భూమిలిచ్చేందుకు తమను సంప్రదిస్తున్నార'ని తెలిపారు. రైతులు ఎవ రు ముందుకొస్తారో మిగిలిన ప్లాట్లలో వారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. రైతు సోదరులు ఎంతోమంది ముందుకొస్తున్నా రన్నారు. కురగల్లు, నిడమర్రు, తుళ్లూరు మండలం రాయపూడిలో 21 ఎకరాలు రైతులు ఇచ్చారన్నారు. నిర్మాణాలను నిపుణులు పరి శీలించి ఇబ్బంది లేదన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులను రద్దుచేసి మళ్లీ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ సీఆర్డీఏ అధికారులు చేపట్టారని వెల్లడించారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కలెక్టర్ భీమారావు, తహసీల్దార్ ఆంజనేయులు, ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.5 కోట్లకుపైగా కొబ్బరి బకాయిలు




అంబాజీపేట: నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రంలో కొబ్బరిని విక్రయించిన రైతులు తమకు రావాల్సిన డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ కేంద్రంలో కొబ్బరిని విక్రయించిన 21 రోజుల్లోనే నగదు రైతుల వ్యక్తిగత ఖాతాల్లో జమకావాల్సి ఉంది. నిర్దేశించిన సమయం దాటిపోవడంతో డబ్బుల కోసం వేచి చూస్తున్నారు. అంబాజీపేట, కొత్తపేటలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి... కర్షకుల నుంచి కొబ్బరి కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు వీరికి సంబంధిత నగదు రాలేదు. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి అంబాజీపేటలోను, అనంతరం కొత్తపేటలోనూ రైతుల నుంచి సేకరించారు. ఆయా కేంద్రాల్లో సుమారు 203 మంది రైతులు సరకు విక్రయించారు. వారంతా బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ కాకపోవడంతో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. నాఫెడ్ కేంద్రంలో కొబ్బరి విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.11,160 చొప్పున చెల్లించాల్సి ఉంది.అంబాజీపేట కొనుగోలు కేంద్రంలో 50 కిలోల చొపున 3,835 సంచుల కొబ్బరి కొనుగోలు చేశారు. కొత్తపేట కేంద్రంలో 5,679 సంచుల కొబ్బరిని కొనుగోలు చేశారు.ఆయా కేంద్రాల్లో మొత్తం 4,757 క్వింటాళ్ల కొబ్బరి రైతుల నుంచి కొనుగోలు చేశారు. అంబాజీపేట, కొత్తపేట నాఫెడ్ కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు ఇప్పటి వరకు రూ.5,30,88,120 రావాల్సి ఉంది. ఈ కేంద్రాలు ప్రారంభించిన తొలి రోజుల్లో కొబ్బరిని విక్రయించిన రైతులకు కూడా ఇప్పటి వరకు నగదు జమకాకపోవటం విశేషం. త్వరగా తమ డబ్బులు జమచేయాలని అన్నదాతలు కోరుతు న్నారు. నాఫెడ్ కేంద్రంలో కొబ్బరిని విక్రయించిన రైతులకు నగదు చెల్లింపులు చేసేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. రైతుల వ్యక్తిగత ఖాతాలకు నగదును జమచేస్తాం.కొన్ని సాంకేతిక కారణాల వల్ల చెల్లింపులు ఆలస్యం అయ్యాయి.

# మత్తు నియంత్రణకు మార్గం ఏదీ ?

ఉమ్మడి జిల్లాలో తరచూ గంజాయి పట్టుబడుతోండటం ఆందోళన కలిగిస్తోంది. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి రోడ్డు, రైలు మార్గానా మహమ్మారి ఇక్కడికి చేరుతోంది. గత 8 నెలల వ్యవధిలోనే ఎక్సైజ్, పోలీసు అధికారులు కిలోల కొద్ది గంజాయిని పట్టుకోవటాన్ని గమనిస్తే దందా ఏ మేరకు సాగుతుందో అర్థమవుతోంది. మరోవైపు గంజాయికి గ్రామీణ యువత, విద్యార్థులు బానిసలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తున్న విషయం. అనారోగ్యానికి గురవుతామని తెలిసిన వారు మత్తు వీడటం లేదు. ఎక్కువగా నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్నారు. స్థానికులు, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడికి రైల్వే మార్గంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, బిజిగిరిషరీఫ్, జమ్మికుంట రైల్వేస్టేషన్లు మహారాష్ట్ర, ఒడిశా,ఏపీ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉండటంతో అక్కడి నుంచి గంజాయి ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చేరుతోంది. రోడ్డు మార్గంలో రవాణా చేస్తూ కూడా నిందితులు పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. జమ్మికుంట రైల్వేస్టేషన్ వద్ద ఓ మహిళ 400 గ్రాముల గంజాయితో స్థానిక ఆబ్కారీ పోలీసులకు పట్టుబడింది. జమ్మికుంటలో ఉంటూ మహారాష్ట్రకు చెందిన వ్యక్తులతో రైల్వే మార్గంలో గంజాయి రవాణా చేస్తున్న విచారణలో తేలింది.

# ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో



తమిళ చిత్రం 'విరాటు'తో 2014లో సినీ రంగ ప్రవేశం చేసిన ప్రగ్యా జైస్వాల్ తెలుగు లో కూడా అదే టైమ్ లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు లో మొదటి సినిమా మిర్చి లాంటి కుర్రాడు సినిమా నిరాశ పరిచింది. మొదటి సినిమా నిరాశ పరచినా కూడా 'కంచె' సినిమాలో నటించే అవకాశం ప్రగ్యాకు వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో కంచె సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్ కి జోడీగా ప్రగ్యా జైస్వాల్ నటించింది. ఆ సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్ లో ఫేమస్ అయ్యింది. కంచె సినిమా మంచివిజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆసినిమాలో ప్రగ్యా అందానికి, నటనకు మంచి మార్కులు పడ్డాయి. కంచె సినిమా తర్వాత టాలీవుడ్‌లో ప్రగ్యావరుసగా ఆఫర్లు దక్కించుకునే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ ఆమె ఎత్తు టాలీవుడ్‌లో ఉన్న చాలా మంది యంగ్‌హీరోల కంటే కాస్త ఎక్కువగానే ఉంది. దాంతో ప్రగ్యాతో నటించేందుకు చాలా మంది ఆసక్తి చూపించలేదు. కంచె తర్వాత ఆమె చేసిన సినిమాలు కొన్ని పర్వాలేదు అనిపించుకోగా, ఎక్కువ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. అయినా కూడా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. బాలయ్యకు జోడీగా నటించిన అఖండ సినిమా భారీవిజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా ఆశించిన స్థాయి లో ఈమెకు ఆఫర్లు రాలేదు. సినిమాల్లో ఆఫర్లతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో ఈమె అందమైన ఫోటోలనుషేర్ చేస్తూ ఉంటుంది. అన్ని భాషల నెటిజన్స్ ప్రగ్యా జైస్వాల్ యొక్క అందమైన ఫోటోలకు ఫిదా అవుతూ ఉంటారు. నెట్టింట ఆమె షేర్ చేసే ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ప్రగ్యా జైస్వాల్ అందమైన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈసారిలేత గోధుమ రంగులో ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షోకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉన్నా కూడా పాపం ప్రగ్యా జైస్వాల్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు, రావాల్సిన ఆఫర్లు రావడం లేదు అనే కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. అఖండ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఈ అమ్మడు బాలకృష్ణతో మరోసారి నటిస్తోంది. బాలకృష్ణ, బాబీ కాంబోలో రూపొందుతున్న సినిమాలో ఒక హీరోయిన్ గా ప్రగ్యా కనిపించబోతుందనే వార్తలు చాలా రోజులుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు మేకర్స్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. సినిమా టైటిల్ ను ప్రకటించిన సమయంలో ప్రగ్యా పాత్ర గురించి మేకర్స్ ఒక క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. బాలయ్య109వ సినిమాను ఇదే ఏడాదిడిసెంబర్ లో విడుదలచేయాలని భావిస్తున్నారు. బాలయ్య సినిమా వచ్చిన తర్వాత అయినా ప్రగ్యాకు మళ్లీ వరుస ఆఫర్లు వస్తాయేమో చూడాలి.

## నాని మూవీ...

# రూమర్స్ వద్దు ప్లీజ్..!



నేచురల్ స్టార్ నాని బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో దూసుకు పోతున్నాడు. తాజాగా వచ్చిన సరిపోదా శనివారం సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మంచి ఓపెనింగ్స్ వచ్చిన ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్న సమయంలో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరదల కారణంగా కాస్త డల్ అయింది. పరిస్థితి కుదుట పడ్డ తర్వాత మళ్లీ సినిమాకు మంచి వసూళ్లు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని బాక్సాఫీస్ వర్గాలవారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో నాని తదుపరి సినిమా గురించి సోషల్ మీడియాలో పుకార్ల మీద పుకార్లు షికార్లు చేస్తున్నాయి. నాని తదుపరి సినిమా ఇప్పటికే శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో అంటూ కన్ఫర్మ్ అయ్యింది. గత సంవత్సరం నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వచ్చిన దసరా సినిమా పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకుంది. అయితే కమర్షియల్‌గా మాత్రంఆశించిన స్థాయిలో సంతృప్తి పరచలేక పోయింది. దసరా పాన్ ఇండియా భారీ హిట్ ను సొంతం చేసుకు ంటుందని భావిస్తే ప్రశంసల వరకు వచ్చి, కలెక్షన్ తగ్గాయి. కానీఈసారి ఏమాత్రం తప్పు జరగకు ండా నానితో ఒక కమర్షియల్ బ్లాక్ బస్టర్ ను తీసేందుకు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్లాన్ చేస్తు న్నాడు. ఇప్పటికే సినిమాకు సంబం ధించిన అధి కారిక ప్రకటన వచ్చిన విషయం తెల్సిందే. సిని మా గురించి ఇప్పటి వరకు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం, సినిమా గురించి వస్తున్న పుకార్ల గురించి చిత్ర యూనిట్ సభ్యుల నుంచి స్పందన వచ్చింది. సినిమా గురించి తప్పుడు ప్రచారం వ్యాప్తి చేయవద్దంటూ టీం ఒక ప్రెస్ నోట్‌ను విడుదల చేయడం జరిగింది. అందులో... సినిమా గురించి పుకార్లు ప్రచారం చేయడం ద్వారా ఆసక్తి దెబ్బతింటుంది. సోషల్ మీ డియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం చూస్తూ ఉంటే చాలా బాధగా ఉంది. నాని - ఓదెల కాంబోలో వస్తున్న సినిమాకు మాకు అత్యంత ప్రతిష్టాత్మకమైనది. పాన్ ఇండియా రేంజ్‌లో ఈ సినిమా భారీ ఎత్తున విడుదల చేసేందుకు మేముప్లాన్ చేస్తున్నాం.తెలుగు ప్రేక్షకులు మాత్రమే కాకుండాఅన్ని భాషల ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. దర్శకుడు బెస్ట్ అవుట్ పుట్ ఇచ్చేందుకు చాలా కష్టపడు తున్నాడు. ఫేక్ న్యూస్ వల్ల టీం మెంబర్స్ ఫోకస్ తగ్గే అవకాశం ఉంది.ఇప్పటి వరకు మీడియాలో వచ్చిన వార్తలు, పుకార్లు పట్టించుకోకండి.సినిమాకు సంబంధించిన ఏ విషయంఅయినా మేము అధికారికంగా ప్రకటించే వరకు నమ్మవ ద్దు. ముందు ముందు మా నుంచి ఆసక్తికర అప్‌డేట్స్ మీ అందరి కోసం వస్తాయి.

# యాక్షన్‌తో రఫ్ఫాడిస్తుంది



ఇటీవలే 'అరణ్మనై-2' చిత్రంలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అగ్ర కథానాయిక తమన్నా. కథాంశాల ఎంపికలో కొత్తదనానికి పెద్దపీట వేస్తూ కెరీర్‌లో దూసుకుపోతుందీ భామ. తాజా తెలుగు చిత్రం 'ఓదెల-2'లో ఈ అమ్మడు యాక్షన్ విన్యాసాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నది. అశోక్‌తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్ వర్క్స్ నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్‌ను తెరకెక్కిస్తున్నారు.

ఈ సన్నివేశాల కోసం తమన్నా ప్రత్యేక శిక్షణ తీసుకుందని, ఆమెలోని ఇంటెన్స్ యాక్షన్ కోణాన్ని ఆవిష్కరించే చిత్రమవుతుందని దర్శకుడు తెలిపారు. 'ఓదెల' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిస్తున్న ఈ సినిమా యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరి తంగా సాగు తుందని నిర్మాతలు తెలిపారు. హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహ, నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్ ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాత: డి.మధు, దర్శకత్వం:

# భాగ్యశ్రీ జోరు మామూలుగా లేదు

నక్కతోక తొక్కి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టినట్టుంది పూణే భామ భాగ్యశ్రీబోర్సే. తెలుగులో ఈ ముద్దుగుమ్మ నటించిన ఒక్క సినిమా కూడా ఇంతవరకూ విడుదల కాలేదు. కానీ అవకాశాలు మాత్రం వరుస పెట్టాయి. దానికి కారణం కేవలం భాగ్యశ్రీ అంద మే. లుక్ పరంగా తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉండటం కూడా ఓ కారణం కావొచ్చు. రవితేజ 'మిస్టర్ బచ్చన్'లో భాగ్యశ్రీ కథానా యికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

ఈ సినిమా విడుదల కాకు ండానే మరో మూడు తెలుగు సినిమాలకు సంతకం చేసేసింది ఈ అందా లభామ. అందులో విజయ్ దేవరకొండ కథానాయకు డిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా ఒకటి. ఈ సినిమా షూటింగ్‌లో కూడా ఇప్పటికే భాగ్యశ్రీ పాల్గొన్నట్టు తెలు స్తున్నది. ఇక రెండో సినిమా నానిది.

ఆయన హీరోగా సు జిత్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. అందులో కూడా భా గ్యశ్రీ బోర్సేనే కథానాయిక. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లన ుంది. అలాగే.. 'లక్కీభాస్కర్' తర్వాత దుల్కర్ సల్మాన్ మళ్లీ తెలుగు లోనే ఓ సినిమా చేయనున్నారట.

రవి అనే కొత్త దర్శకుడు తెరకెక్కించనున్న ఈ సినిమాలో కూడా భాగ్యశ్రీబోర్సేనే కథానా యికగా కన్ఫర్మ్ అయ్యిందట.



## మరో రెండు కొత్త

# ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్



సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు బాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది రష్మిక మందన్న. ప్రస్తుతం అల్లు అర్జున్‌కు జంటగా 'పుష్ప 2: ది రూల్', ధనుష్‌తో 'కుబేర' చిత్రాల్లో నటిస్తున్న ఆమె.. మరోవైపు రెయిన్ బో, ది గర్ల్ ఫ్రెండ్, చావా లాంటి చిత్రాల్లో నటిస్తోంది. అలాగే 'సికందర్'లో సల్మాన్‌కు జంటగా కనిపించనుంది. తాజాగా మరో రెండు కొత్త ప్రాజెక్టులకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమిళ హీరో శివ కార్తికేయన్‌కు జంటగా ఓ సినిమా చేయబోతోందట. 'డాన్' కాంబినేషన్ రిపీట్ చేస్తూ సీబీ చక్రవర్తి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు శివ కార్తికే యన్. ఎస్.జె. సూర్య ఇందులో కీలకపాత్ర పోషించనుండగా.. హీరోయిన్‌గా రష్మికను సంప్రదిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఆయుష్మాన్ ఖురానా హీరోగా తెరకెక్కబోయే 'వాంపైర్స్ ఆఫ్ విజయ్‌నగర్' అనే హారర్ మూవీలోనూ హీరోయిన్‌గా రష్మికను తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది. ఆదిత్య సత్పోదర్ డైరెక్ట్ చేయనున్న ఈ చిత్రాన్ని స్త్రీ, భేడియా లాంటి హారర్ థ్రిల్లర్స్ నిర్మించిన దినేష్ విజన్ ప్రొడ్యూస్ చేయనున్నారు. చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న రష్మిక ఖాతాలో మరో రెండు సినిమాలు చేరబోతున్నాయి...

## ప్రశాంత్ వర్మ..

# ఏంటా చాలెంజ్..?



ప్రశాంత్ వర్మ 'హనుమాన్' సినిమా ద్వారా పాన్ ఇండియా హిట్ సాధించిన సంగతి తెలిసిందే. ఈసినిమాకు సీక్వెల్ గురించి ప్రకటించిన తర్వాత బాలీవుడ్ లో రణ్వీర్ తో ఓ సినిమా చేయాలని అనుకున్నాడు. కానీ అది మొదట్లోనే క్యాన్సిల్ అయ్యింది. తాజాగా ఆయన మోక్షజ్ఞ నందమూరికి సంబంధించిన ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మోక్షజ్ఞ లాంచింగ్ ఈవెంట్ జరగబోతుందని వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అఫీషియల్ క్లారిటీ రాకపోయి నప్పటికి ఈ కాంబినేషన్ ఫైనల్ అని ఇండస్ట్రీలో అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో,ప్రశాంత్ వర్మ ఇటీవల తన సోషల్ మీడి యాలో ఒక క్రేజీ పోస్ట్ పెట్టారు, ఇది ప్రేక్షకులలో మరియు సినీ ప్రే మికుల్లో ఆసక్తి కలిగిస్తోంది. ఆయన ఒక ఫోటోను షేర్ చేస్తూ "చాలెంజ్ స్వీకరించబడింది" అని ట్వీట్ చేశారు.

ఇది ఎంతవరకు మోక్షజ్ఞ డెబ్యూ సినిమా సంబంధమా లేదా 'హనుమాన్' సీక్వెల్ గురించి ఉద్దేశించినదా అనే ప్రశ్నలు కలుగుతున్నాయి. ప్రశాంత్‌వర్మ మోక్షజ్ఞ కోసం ఓకొత్త కథను సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈకథలో బా లకృష్ణ అతిథి పాత్రలో కనిపిస్తారని ముందు నుంచీ ప్రచారం జరుగుతోంది. బాలకృష్ణ ఈ సినిమాలో కృష్ణుడిగా దర్శనమివ్వబోతున్నా రని లేటెస్ట్‌గా వస్తున్న మరొక టాక్. 'హనుమాన్' సిని మాలోఉన్న మైథలాజికల్ టచ్,సూపర్ హీరో అంశాలను, ఈ సిని మాకు కూడా అన్వయించనున్నట్లు సమాచారం.

# గోధుమ పిండికి ఇవి కలిపితే టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..

బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు. గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం.

ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది. మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు,

కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది.

ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్.. మునగాకు పొడి-పసుపుజి--మెంతి పొడి-వాము-అవిసె గింజలు



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215